www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 22 ఏప్రిల్ 2024 8 పేజీలు

తూర్పుగోదావరి కాకినాడ కోనసీమ

కాషాయం తీర్థానికి నల్లమిల్లి రంగం సిద్ధం

- అనపర్తి బిజెపి అభ్యర్థిగా రామకృష్ణారెడ్డి
- నేడు అధికారికంగా ప్రకటించే అవకాశం

రామవరంలోని తన స్వగృహంలో ముఖ్య నాయకులతో చర్చిస్తున్న నల్లమిల్లి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

అనపర్తిలో టిడిపిని బలోపేతం చేయడంలో కీలకంగా వ్యవహరించిన నల్లమిల్లి కుటుంబం ఆ పార్టీకి దూరం కానుంది. టిడిపి అధినేత చంద్రబాబు పొత్తులే ఈ పరిస్థితికి కారణమని తెలుస్తోంది. టిడిపి ఆవిర్భావం నుంచి నల్లమిల్లి కుటుంబం ఆ పార్టీలో కొనసాగుతోంది. నల్లమిల్లి మూలారెడ్డి టిడిపి వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరిగా ఉండటంతో పాటు ఆ పార్టీ నుంచి ఎంఎల్ఎగా గెలుపొంది సేవలందించారు. కార్యకర్తలలో తనదైన ముద్ర వేశారు. అయితే తాజా పరిస్థితులు పార్టీకి దూరం చేయటంతో కార్యకర్తల్లో ఆందోళన నెలకొంది. బిజెపితో పొత్తు నేపథ్యంలో అనపర్తి అసెంబ్లీ స్థానానికి తొలుత ఆ పార్టీ ఎం.శివకృష్ణంరాజును అభ్యర్థిగా ప్రకటించిన విషయం విదితమే. ఈ ప్రకటన అనంతరం అనపర్తిలో టిడిపి భగ్గుమంది. కార్యకర్తల ఆందోళనలు సైతం మిన్నంటాయి. తనకు సీటు రాకపోవటానికి వైసిపి నేతలే కారణమంటూ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆరోపించారు. అనపర్తిలోని వైసిపి కీలక నేతలు, బిజెపికితో కలిసి తెరవెనుక రాజ కీయం నడి పారంటూ బిజెపి పెద్దలపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. అయితే ఇపుడు అదే పార్టీ నుంచి పోటీ చేయాల్సి రావడంతో ఏ మేరకు సహాయ సహకారాలు అందుతాయో వేచి చూడాల్సి ఉంది.

ఓటర్లు మొగ్గు చూపేనా..?

బిజెపి, జనసేన పొత్తు నేపథ్యంలో టిడిపి మూడు నియోజకవర్గాలతో పాటు ఒక ఎంపీ స్థానాన్ని మిత్ర పక్షాలకు వదలుకోవడం అనివార్యమైంది. అనపర్తి నియోజకవర్గంలో తనకు సీటు ఇవ్వాలంటూ నల్లమిల్లి రామకృష్ణ రెడ్డి కొన్ని రోజులుగా న్యాయం కోసం నల్లమిల్లి అనే కార్యక్రమం చేపట్టి కుటుంబ సభ్యులతో పాటు ప్రజల్లోకి వెళుతున్నారు. ఇటీవల ఆయన సతీమణితో నామినేషన్ సైతం వేయించారు. టిడిపి బి ఫామ్ ఇవ్వకపోతే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసే పరిస్థితులు నెలకొనడంతో కూటమి నేతలు ఈ నిర్ణయానికి వచ్చినట్టు స్పష్టమవుతోంది. నల్లమిల్లి కుటుంబం గత నాలుగు దశాబ్దాలుగా టిడిపితో ఉంది. స్వయంగా వైఎస్ రాజశేఖరరెడ్డి ఆహ్వానించినా కాంగ్రెస్‌లోకి వెళ్లలేదని నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గతంలో ప్రకటించిన విషయం విదితమే. 2014 ఎన్నికలలో టిడిపి నేత నల్లమిల్లి రామకృష్ణారెడ్డి 1373 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. 2019లోనూ వైసిపి అభ్యర్థి సత్తి సూర్యనారాయణ రెడ్డికి గట్టి పోటీ ఇచ్చారు. తాజాగా బిజెపి నుంచి పోటీ చేయాల్సి రావడంతో కార్యకర్తల్లో అలజడి మొదలయ్యింది. నాయకులు మారినంత తేలికగా 2లో..

సమావేశంలో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు

త్రిమూర్తులు బెయిల్ రద్దు చేయాలి

దళిత, ప్రజా సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

వైసిపి ఎంఎల్‌సి, వైసిపి మండపేట నియోజకవర్గ అభ్యర్థి తోట త్రిమూర్తులు బెయిల్‌ను రద్దు చేసి జైలుకు పంపాలని దళిత, ప్రజా సంఘాల సమావేశం తీర్మానించింది. ఆదివారం కాకినాడ సుందరయ్య భవన్‌లో సీనియర్ దళిత నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు అధ్యక్షతన దళిత, ప్రజా సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ 1996 డిసెంబర్ 29న రామచంద్రపురం మండలం వెంకటాయపాలెంలో అప్పటి ఎంఎల్ఎ తోట త్రిమూర్తులు దళితులకు శిరోముండనం చేయించి, దళితులను చిత్రహింసలకు గురి చేశారని అన్నారు. ఆ కేసుపై 28 ఏళ్ల సుదీర్ఘ పోరాట ఫలితంగా విశాఖపట్నం స్పెషల్ కోర్ట్ 18 నెలలు జైలు, రూ.2 లక్షల జరిమానా విధించిందని గుర్తు చేశారు. ఈ తీర్పు పట్ల దళిత ప్రజాసంఘాల సమావేశం ఆవేదన వ్యక్తం చేసిందన్నారు. ఇంత తీవ్రమైన కేసులో కేవలం 18 నెలలు శిక్ష వేయడం వల్ల అతని ఎంఎల్‌సి పదవికి గాని, రాజకీయ భవిష్యత్తుకుగాని ఏమాత్రం నష్టం ఉండదన్నారు. ఏ పదవి ఉందనే అహంకారంతో, కుల దురహంకారంతో దళితుల పట్ల త్రిమూర్తులు అంత క్రూరంగా వ్యవహరించాడో ఆ పదవే పోకపోతే ఇంతకాలం బాధితులు, దళిత, ప్రజా సంఘాలు చేసిన పోరాటానికి అర్థమే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసులో సీనియర్ జర్నలిస్టు టిఎస్ఎన్ రాజు మీడియాలో రాసిన కథనం ద్వారా ఈ దురాగతం ప్రపంచానికి తెలిసిందన్నారు. దళిత ఉద్యమ గొంతుక బొజ్జా తారకం కృషి వల్ల ఈ కేసు ఇంతకాలం నిలబడిందని అన్నారు. ఈ కేసులో బెయిలుపై బయటకు వచ్చిన త్రిమూర్తులు బహిరంగంగా దళితులను, కోర్టులను కించపరుస్తూ అహంకారంతో మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కేసు పెద్ద కేసే కాదని, రెండు గంటల్లో బయటకు వచ్చేశానని మాట్లాడిన మాటలు సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్నాయని తెలిపారు. ఇంత అహంకారి, దళిత వ్యతిరేకి అయిన తోట త్రిమూర్తులు బెయిలు రద్దుచేసి జైలుకు పంపాలని సమావేశం డిమాండ్ చేసింది. ఈ సుదీర్ఘ కాలంలో రాష్ట్రంలోని అన్ని పాలక పార్టీలు, అధికారులు కూడా అతనికి అండగా ఉన్నారన్నారు. అయినప్పటికీ బాధితులు ధైర్యంగా నిలబడడంతో ఈ మాత్రం విజయమైనా దక్కిందని, సాధించడం జరిగిందని శిరోముండన బాధితులకు సమావేశం అభినందనలు తెలిపింది. భవిష్యత్తులో బాధితులకు ఏ ప్రమాదం రాకుండా ఉండాలంటే తోట త్రిమూర్తులు ఎంఎల్‌సి పదవిని రద్దు చేయాలని, రాబోవు ఎన్నికల్లో 2లో..

నేడు జగ్గంపేటలో ప్రజాగళం సభ

హాజరు కానున్న టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి - జగ్గంపేట

ఈ నెల 22న జగ్గంపేటలో ప్రజాగళం సభకు ఏర్పాట్లు పూర్తియ్యాయి. సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు జగ్గంపేట మెయిన్ రోడ్డులోని నాలుగు రోడ్ల కూడలి వద్ద ప్రజాగళం సభ జరగనుంది. ఈ సభలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు హాజరు కానున్నారని టిడిపి జగ్గంపేట నియోజకవర్గ అభ్యర్థి జ్యోతుల నెహ్రూ ఆదివారం మీడియాకు వెల్లడించారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు హెలికాప్టర్‌లో చంద్రబాబు జగ్గంపేటకు చేరుకుంటారని, అనంతరం మెయిన్ రోడ్డులోని నాలుగు కూడలి వద్ద సభలో పాల్గొంటారని తెలిపారు. ఈ సభకు టిడిపి, జనసేన, బిజెపి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు.

కార్టూ'నిజం'



అభ్యర్థుల ప్రచార ఖర్చులపై నిరంతర నిఘా

సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు నీనా నిగమ్, కలెక్టర్ నివాస్

ప్రజాశక్తి-కాకినాడ

ఎన్నికల ప్రచారానికి వ్యయ పరిమితికి మించి వెచ్చించే అవకాశం ఉన్న ఆయా అభ్యర్థుల ఖర్చులపై నిరంతర నిఘా ఉంచాలని ఎన్నికల వ్యయ ప్రత్యేక పరిశీలకులు, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి నీనా నిగమ్ ఆయా నోడల్ ఏజెన్సీ అధికారులను ఆదేశించారు. ఆదివారం జిల్లాలో వివిధ రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల పర్యవేక్షణ, అలాగే సాధారణ ఎన్నికల సన్నద్ధతపై కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్లకు ప్రలోభాలకు గురి చేసే ప్రయత్నంలో భాగంగా నగదు, బహుమతుల పంపిణీపై సీ-విజిల్ లాంటి అప్లికేషన్ల ద్వారా ఫిర్యాదు దాఖలు చేసేలా ప్రజలను ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఎన్నికలు స్వేచ్ఛగా, ప్రశాంతమైన వాతావరణంలో జరిగే విధంగా పనిచేయాలని ఆమె సూచించారు. కాకినాడ జిల్లాలో ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు చేసిన ఏర్పాట్లు, సన్నద్ధత ప్రణాళిక పట్ల ఆమె సంతృప్తిని వ్యక్తం చేశారు. స్వతంత్ర అభ్యర్థుల సహా రిజిస్టరై, గుర్తింపు పొందని రాజకీయ పార్టీలు, వారి అభ్యర్థుల ప్రచార ఖర్చుల నమోదుపై కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. బ్యాంకుల నుంచి జరిగే అనుమానాస్పద నగదు లావాదేవీలు, ముఖ్యంగా ఐదు లక్షలకు మించిన నగదు డిపాజిట్లపై, మద్యం షాపులకు వెళ్ళే సరకు రవాణాపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఖర్చుల పర్యవేక్షణ, ఎన్నికల ప్రచారాన్ని తనిఖీ చేయడానికి ఇప్పటికే ప్రత్యేక బృందాలు క్షేత్ర స్థాయిలో పని చేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. తొలుత జిల్లా కలెక్టర్ జె.నివాస్, ఎస్‌పి ఎస్.సతీష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, డిఆర్ఒ డాక్టర్ డి.తిప్పేనాయక్ ఎన్నికల వ్యయ ప్రత్యేక పరిశీలకులు ఆమెకు పూల బొకేలు అందజేసి, స్వాగతం పలికారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ తొలుత ఎన్నికల వ్యయ ప్రత్యేక పరిశీలకులు నీనా నిగమ్‌కు జిల్లాలోని వ్యయ పర్యవేక్షణ బృందాల పనితీరు గురించి వివరించారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు, జిల్లా ఎన్నికల నియంత్రణ కేంద్రం (కంట్రోల్ రూమ్), రాజకీయ ప్రచారానికి సంబంధించిన అనుమతుల వివరాలు, జిల్లా ఎన్నికల నిర్వహణ ప్రణాళిక కార్యకలాపాలు, ఎన్నికల సంబంధిత ఇతర అంశాలపై వివరించారు. జిల్లా ఎస్‌పి ఎస్.సతీష్‌కుమార్ జిల్లాలో ఎన్నికల కోసం చేసిన భద్రత ఏర్పాట్లను, చెక్ పోస్ట్ వద్ద తనిఖీ అంశాలను ఆమెకు వివరించారు. యానాం సరిహద్దు వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్, ఇప్పటి వరకూ సీజ్ చేసిన నగదు, మద్యం, బంగారం, గంజాయి వంటి వాటి వివరాలు, నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ల గురించి వివరించారు. అనంతరం కలెక్టరేట్ స్పందన హాల్లో ఏర్పాటు చేసిన ఎన్నికల కమాండ్ కంట్రోల్ రూమ్, మీడియా సెంటర్‌ను ఎన్నికల వ్యయ ప్రత్యేక పరిశీలకులు నీనా నిగమ్. సందర్శించారు. ఈ సమావేశంలో డిఎఫ్ఒ ఎస్.భరణి, డిఆర్‌డిఎ పీడీ కె.శ్రీరమణి. డిపిఒ కె.భారతి సౌజన్య, కమర్షియల్ టాక్స్ జాయింట్ కమిషనర్ సుమతి, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్‌పి శ్రీలత, సిపిఒ త్రినాథ్, లీడ్ బ్యాంకు మేనేజర్ ప్రసాద్, జిల్లా ఆడిట్ అధికారి వై.సురేష్, డిపిఆర్ఒ డి.నాగార్జున, జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్ఒలు, తదతరులు పాల్గొన్నారు.

నేడు వేగుళ్ల నామినేషన్

ప్రజాశక్తి-మండపేట

మండపేట నియోజకవర్గం టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థిగా వేగుళ్ల జోగేశ్వరరావు ఉండవల్లిలో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు చేతులు మీదుగా ఆదివారం బి ఫారమ్‌ను అందుకున్నారు. దీనితో ఈ నియోజకవర్గం నుంచి వరుసగా అయిదవ సారి టిడిపి తరపున బి ఫాంమ్‌ను వేగుళ్ల అందుకున్నట్లు అయ్యింది. సోమవారం వేగుళ్ల నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు స్థానిక ఏడిద రోడ్డులోని కళ్యాణి రైసమిల్లు వద్దకు కూటమి శ్రేణులు చేరుకోవాలని కోరారు.ర్యాలీగా బయలుదేరి తహశీల్దార్ కార్యాలయం నందు నామినేషన్ వేస్తారని తెలిపారు.

నేటి నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-ఉండ్రాజవరం

మండలంలోని మోర్త - కానూరు 11 కె.వి ఫీడర్ నందు ఆర్ డి ఎస్ ఎస్ పనుల నిమిత్తం దమ్మెన్ను గ్రామ ప్రజలకు ఈ నెల 22వ తేదీ నుంచి ఈ నెల 24వ తేదీ వరకు ఉదయం 6 నుంచి మద్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఎపి ఇపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వీరభద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వ్యవసాయ, వాణిజ్య, గృహ వినియోగదారులు సహకరించవలసిందిగా ఆయన కోరారు. సోమ, మంగళ, బుధ మూడు రోజుల పాటు నిర్వహించే ఈ పనుల వల్ల భవిష్యత్తులో త్రీఫేజ్ విద్యుత్ సరఫరా నిరంతరాయంగా అవుతుం దన్నారు. సరఫరాలో అంతరాలు తొలగిపోతాయన్నారు. ఆర్‌డిఎస్ఎస్ పనులు మండలంలో మొట్టమొదట దమ్మెన్ను గ్రామం నుంచి ప్రారంభిస్తున్నట్లు మండల ఎఇ ఎన్. దొరబాబు తెలిపారు.

పట్టణంలో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ప్రతి కుటుంబానికి మంచి చేసిన ప్రభుత్వాన్ని ఎన్నికల్లో గెలిపించాలని ముమ్మిడివరం నియోజకవర్గ అసెంబ్లీ వైసిపి అభ్యర్థి పొన్నాడ సతీష్ కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని పలు వార్డులలో ఆదివారం సుడిగాలి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆయన ఓట్లు అభ్యర్థిస్తూ గత అయిదేళ్లుగా సిఎం జగన్ చేపట్టిన సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. లబ్ధి పొందిన ప్రతి కుటుంబం ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడీ ప్రవీణ్ కుమార్ మరియు వైసిపి కౌన్సిలర్ల తోపాటు పితాని బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాపై నిరాధార ఆరోపణలు తగవు

జక్కంపూడి గణేష్ ఆవేదన

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

తనపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆరోపణలు చేయడం తగదని వైసిపి యువజన విభాగం నాయకుడు జక్కంపూడి గణేష్ ఆవేదన వ్యక్తంచేశారు. కోరుకొండలో శనివారం రాత్రి జరిగిన వారాహి సభలో పవన్ కళ్యాణ్ చేసిన విమర్శలపై గణేష్ స్పందిస్తూ స్థానిక తాడితోట సంహిత కన్వెన్షన్ హాలులో ఆదివారం మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. గణేష్ మాట్లాడుతూ గాడాల్లో మూడు బిల్డింగ్స్ లో బెట్టింగ్ రాకెట్లు నడుపుతు న్నట్లు పవన్ కళ్యాణ్ ఆరోపించడం శోచనీయమన్నారు. బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్ లు నడుపుతున్నట్లు పదే పదే విమర్శలు చేస్తున్నారని, చివరకు ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదివేసి పవన్ కళ్యాణ్ కూడా ఇదేరకమైన విమర్శలు చేయడం దారుణమని అన్నారు. పవన్ చేసిన ఆరోపణల నేపథ్యంలో దమ్ముంటే ఆధారాలతో నిరూపించాలని డిమాండ్ చేస్తూ గత రాత్రి గాడాలలో మూడు గంటల పాటు భైరాయించానని గుర్తుచేశారు.

కాపునాడు మండల అధ్యక్షునిగా సురేష్

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

కాపునాడు మండల అధ్యక్షునిగా తెలుగు యువత నాయకుడు గొల్లవిల్లికి చెందిన మద్ధింశెట్టి సురేష్ నియమితులయ్యారు. ఆదివారం అమలాపురంలో కాపునాడు వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బిరెడ్డి సురేష్ చేతుల మీదుగా సురేష్ నియామక పత్రాలను అందుకున్నారు. తన ఎంపికకు కషిచేసిన కాపు నాడు ఉపాధ్యక్షులు గంగుమళ్ల శ్రీనివాస్, నిమ్మకాయల జగ్గయ్య నాయుడు,అరిగెల నానాజీ, తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

అభ్యర్థులు ఎన్నికల నియమావళి పాటించాలి

జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

ప్రజాశక్తి-అమలాపురం

పార్లమెంట్ అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు ఎన్నికల కమిషన్ నియమావళి, నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే వారికి ఉండాల్సిన అర్హతలపై ఎన్నికల కమిషన్ దిశా నిర్దేశం చేసింద న్నారు. అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసేందుకు సువిధ యాప్ ను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. నామినేషన్లు సువిధ యాప్ ద్వారా దాఖలు చేసిన తర్వాత హార్డ్ కాపీలను ఎన్నికల రిటర్నింగ్ అధి కారికి అందజేసే క్రమంలో ఆర్ఒ ఛాంబర్ లోనికి అభ్యర్థితో పాటు ఐదుగురిని మాత్రమే అనుమతిస్తామన్నారు. అభ్యర్థులు తమ బి-ఫారమ్, ఎ-ఫారమ్ ఒరిజినల్ అందిం చాలన్నారు. వీటిని నామినేషన్ గడువు ముగిసే రోజు మధ్యాహ్నం మూడు గంటల్లోపు అందజేయ వచ్చునన్నారు..అభ్యర్థులు ఒక స్టాంప్ సైజ్ ఫోటో మరొక పాస్పోర్టు సైజ్ ఫొటోను నామినేషన్తో పాటు అందజేయాలన్నారు. అభ్యర్థి తన ఓటరు కార్డు. బలపరిచే వారి గుర్తింపు పత్రాలు ఇవ్వాలన్నారు. ఒక అభ్యర్థి గరిష్టంగా నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేయ వచ్చునని, నామినేషన్ దాఖలు చేసే సమయంలో ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రతిజ్ఞ తప్ప నిసరిగా చేయాలన్నారు. ప్రతిజ్ఞ చేసిన ధ్రువీకరణ పత్రాలన్నీ తీసుకో వాలన్నారు .ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అభ్యర్థి తన సంతకం ఉండే విధానాన్ని విధిగా తెలియ జేయాలి. అదేవిధంగా బ్యాలెట్ యూనిట్లో తన పేరు ఎలా ముద్రిం చాలో వివరించి చెప్పాలన్నారు. అభ్యర్థి చెల్లించిన ధరావత్తుకు సంబంధించి రసీదుతో పాటు, ఎన్నికల ఖర్చును నమోదు చేసేందుకు నిర్ణీత నమూనాలో ఉన్న రిజిస్టర్ ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి తీసుకోవాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులపై ఏవైనా క్రిమినల్ కేసులుంటే, వాటిని మూడు దినపత్రికల్లో ప్రకటన ద్వారా బహిర్గతం చేయాలన్నారు. అందుకు అయ్యే ఖర్చును లెక్క చూపాలన్నారు. ఎన్నికల నామినేష న్ కేంద్రం లో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారన్నారు. అభ్యర్థులు తమ సందేహాలను అక్కడ నివృత్తి చేసుకోవచ్చునన్నారు. ప్రచారానికి సంబంధించిన కార్యక్రమాలు, వాహనాలు, ఇతర వాటికి సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకుంటేనే అనుమతి ఇస్తారన్నారు. అభ్యర్థు లకు సంబంధించిన అఫిడవిట్లు అందరికీ తెలిసేలా అందు బాటులో ఉంచుతారన్నారు. ప్రజలు కోరితే వాటిని ఉచితంగానే అందజేస్తార న్నారు. ఆన్లైన్లోనూ ఇవి అందుబా టులో ఉంటాయన్నారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటల అనంతరం ఆ రోజు వచ్చిన నామినేషన్లపై అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి ఎన్నికల సంఘానికి తెలియజేస్తార న్నారు.నామినేషన్లను, అఫిడవిట్లను ఎప్పటికప్పుడు ఆన్లైన్లోనూ, నోటీసు బోర్డులోనూ పరిశీలనకు ఉంచుతారన్నారు. నామినేషన్ల దాఖలు పారదర్శకంగా ఉండేందుకు ప్రక్రియను సంపూర్ణంగా వీడియో తీయిస్తారన్నారు.

జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

పలు చోట్ల చలివేంద్రాల ఏర్పాటు

తాడిపర్రులో మజ్జిగ పంపిణీ చేస్తున్న దాతలు

ఉష్ణోగ్రతలు పెరగడంతో జిల్లాలో పలుచోట్ల ఆదివారం దాతలు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పాదచారులకు, ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

ఉండ్రాజవరం మండలం లోని తాడిపర్రు లో ఆదివారం మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు. వేసవిలో స్థానికులతో పాటు, గ్రామం మీదుగా ఇతర ప్రాంతాల నుండి రాకపోకలు సాగించే ప్రయాణీకులకు దాహార్తిని తీర్చేందుకు దాత గారపాటి సత్యనారాయణ, తదితరుల ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభిం చారు. తొలి రోజు ప్రారంభంలో సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కె.విజయచౌదరి, వాకలపూడి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు. **చాగల్లు** మానవతా సేవ సంస్థ వారి ఆధ్వర్యంలో 20వ రోజు ఆదివారం మజ్జిగ పంపిణీ పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మజ్జిగ దాతలు ముళ్లపూడి వెంకట రామకష్ణ శ్రీనివాసరావు, హనురాధ దంపతులు చాగల్లు మండలం మానవత స్వచ్ఛందసేవాసంస్థ మరియు గ్రామ పంచాయతీ తరపున దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మానవతా సేవా సంస్థ సభ్యులు కొట్టూరు శ్రీనివాసరావు, జజ్జవరపు వెంకట కృష్ణప్రసాద్ మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా దాతలు ముందుకు రావాలని కోరారు.

చాగల్లులో 'మానవత' సంస్థ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

సామాజిక న్యాయానికి జగన్ ప్రాధాన్యత

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

సామాజిక న్యాయం సిఎం వైఎస్.జగన్ ప్రాధాన్యతను ఇచ్చారని ఓఎన్‌జిసి ఎక్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఆలిండియా ఓఎన్‌జిసి ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ యూనియన్ ప్రెసిడెంట్ డిఎంఆర్.శేఖర్, భవాని దంపతులు పేర్కొన్నారు. సిఎం జగన్‌ను మరోసారి సిఎంగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వారు అన్నారు. సిఎం జగన్ సమక్షంలో వీరిద్దరూ శనివారం పాయకరావుపేటలో వైసిపి లో చేరారు. ఈ సందర్భంగా వారిద్దరికీ స్థానిక పేపర్ మిల్ మెయిన్ గేట్ ఎదురుగా గల కృష్ణ సాయి కళ్యాణ మండపంలో వైసిపి నాయకుడు టికె.విశ్వేశ్వర్ రెడ్డి అభినందన సత్కారం నిర్వహించారు. డిఎంఆర్.శేఖర్ మాట్లాడుతూ మీడియాతో మాట్లాడుతూ ఎన్నో ఆశయాలతో, ఆశలతో సామాజిక న్యాయం అమలు చేస్తారన్న ఉద్దేశ్యంతో జనసేనలో చేరినప్పటికీ నిరాశ మిగిలిందన్నారు. పేదల పిల్లలు బాగా చదువుకోవాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వ పాఠశాలలను సిఎం జగన్ తీర్చిదిద్ది, సౌకర్యాలు కల్పించి ఇంగ్లిషు మీడియం ప్రవేశపెడితే దాన్ని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వ్యతిరేకించడం వింతగా అనిపించిందని పేర్కొన్నారు. ఇలా వ్యతిరేకించడం మంచిది కాదని కూడా చెప్పామని అన్నారు. టిక్కెట్ కోసం తాను వైసిపిలో చేరలేదన్నారు. జగన్ నిబద్ధత, చెప్పిన ప్రకారం చేస్తున్న విధానం తమను ఆకట్టుకున్నాయని అన్నారు. కాగా విశ్వేశ్వర రెడ్డితో ఆంధ్రా యూనివర్సిటీలో చదువుకున్నప్పటి నుంచి గల అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ ఓఎన్‌జిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గా శేఖర్ పని చేసినపుడు ఈ ప్రాంత అభివృద్ధికి అవసరమైన నిధులు అందించారన్నారు. సిఎం జగన్ విధానాలు నచ్చి వైసిపిలో చేరినందుకు అభినందనలు తెలిపారు. డాక్టర్ అనసూరి పద్మలత, తదితరులు పాల్గొన్నారు.

గూడూరి, భరత్‌లకు కృష్ణ బలిజ సంక్షేమ సంఘం మద్దతు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం లోక్‌సభ వైసిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్, సిటీ వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి మార్గాని భరత్ రామ్‌లకే తమ మద్దతు అని కృష్ణ బలిజ (బుక్క) సంక్షేమ సంఘం ప్రకటించింది. ఆదివారం నగరంలోని రౌతు తాతాలు కల్యాణ మండపంలో సంక్షేమ సంఘ కార్యవర్గ సమావేశం నిర్వహిం చారు. తాడి సూరిబాబు అధ్యక్షత వహించారు. ఎంపీ భరత్, రుడా ఛైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, గూడూరి రాధిక ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పలువురు మాట్లాడుతూ నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దిన ఎంపీ భరత్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్ విజయంతోనే నగర అభివృద్ధి అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం మంచి జరిగిందని భావిస్తేనే నన్ను ఎంఎల్ఏగా గెలిపించమన్నారు. సమావేశంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, సంఘ పెద్దలు మాజీ కార్పొరేటర్లు అరవ సురేష్ కుమార్, బెజవాడ రాజకుమార్, బెజవాడ రంగారావు, మామిడిపల్లి రామకృష్ణ, పిల్లాడి పరమహంస పాల్గొన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి అరవ శ్రీధర్ అతిథులకు స్వాగతం పలకారు

త్రిమూర్తులు బెయిల్ రద్దు చేయాలి

(మొదటి పేజీ నుంచి)

అతనికి ఎంఎల్ఎ టికెట్ ఇచ్చిన వైసిపి దాన్ని రద్దు చేయాలని, ఒకవేళ అతను మండపేటలో పోటీ చేస్తే మండపేట ప్రజానీకం అతన్ని ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కేసులో అతనికి పూర్తిస్థాయి శిక్ష పడే వరకు న్యాయ పోరాటం చేయాలని, ఎన్నో ఒత్తిళ్లు వచ్చినా ధైర్యంగా నిలబడిన బాధితులకు దళిత ప్రజా సంఘాల అండగా ఉండాలని చేసిన తీర్మానాలను ఈ సమావేశం ఆమోదించింది. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు అయినాపురపు సూర్యనారాయణ, భయ్యా రాజేంద్రకుమార్, గుబ్బల ఆదినారాయణ, బచ్చులి కామేశ్వరరావు, కాశి బాలయ్య, సిద్ధాంతలు కొండబాబు, టి.నూకరాజు, తాడి బాబ్జి, తాడి ప్రసాద్, దువ్వా శేష బాబ్జి, కెఎస్.శ్రీనివాస్, పివి సత్యనారాయణ, టి.చంగలరావు, కె.రవికుమార్, ఎస్.ఫణేశ్వరరావు, దూసర్లపూడి రమణ రాజు, టి.పథ్వీ పాల్గొన్నారు.

కాషాయం తీర్థానికి నల్లమిల్లి రంగం సిద్ధం

(మొదటి పేజీ నుంచి)

ఓటర్లు పార్టీ మారుతారా..? అనే సందేహం వ్యక్తమవుతోంది.

బిజెపి అభ్యర్థిగా నేడు ప్రకటించే అవకాశం

బిజెపి అభ్యర్థిగా నల్లమిల్లిని నేడు ప్రకటించే అవకాశాలు నెలకొన్నాయి.. ఆదివారం రామవరంలో నల్లమిల్లిని బిజెపి నాయకులు కంటిపూడి సర్వారాయుడు కలిశారు. సమావేశం అనంతరం కూటమి తరపున నల్లమిల్లి విజయం కోసం ప్రచారం చేస్తామని, కూటమి అభ్యర్థిగా నల్లమిల్లి బరిలో ఉంటారని స్పష్టం చేశారు. నేడో రేపో ప్రకటన రావచ్చునని తెలిపారు. కంటిపూడి సర్వారాయుడితో సమావేశమైన అనంతరం రామకృష్ణారెడ్డి తన అనుచరులతో భేటీ అయ్యారు. బిజెపి నుంచి బరిలో నిబడితే గెలిచే అవకాశాలపై చర్చించినట్లు తెలిసింది. అనం తరం మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు నిర్ణయమే తనకు శిరోధార్యమని ప్రకటించారు. ఎన్‌టిఆర్ పార్టీ పెట్టిన నాటి నుండి మూలారెడ్డి, తాను గానీ పార్టీ మాట జవ దాటలేదన్నారు.

క్రైం వార్తలు

గంజాయి తరలిస్తున్న ఇద్దరు మైనర్లు అరెస్టు

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని తాళ్లూరు గ్రామ శివారులో స్కూటీపై వెళ్తున్న ఇద్దరు మైనర్లను అదుపులో తీసుకుని కేజీ గంజాయిరని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు. ఎన్‌టిఆర్ జిల్లా పెనమలూరు గ్రామానికి చెందిన ఇద్దరు మైనర్లు గంజాయికి బానిసలై తునిలో గుర్తు తెలియని వ్యక్తి వద్ద కేజీ గంజాయి కొనుగోలు చేశారు. ఆ గంజాయిని తీసుకుని స్కూటీ డిక్కీలో పెట్టుకుని విజయవాడ వెళ్తుండగా తాళ్లూరు గ్రామ శివారున వాహన తనిఖీల్లో భాగంగా వారి స్కూటీని నిలుపుదల చేసి తనిఖీ చేసినట్లు తెలిపారు. ఆ తనిఖీల్లో కేజీ గంజాయిని స్వాధీనం చేసుకుని, రవాణాకు విని యోగించిన స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో బోల్తా యువకుడు మృతి

ప్రజాశక్తి - రామచంద్రపురం

తీర్థయాత్రలకు వచ్చిన కుటుంబ సభ్యులు ఆటో బోల్తా పడటంతో ఒకరు మృతి చెంది, మరికొందరు గాయాలు పాలైన సంఘటన కె.గంగవరం మండలం కుందూరు మెయిన్ రోడ్డుపై ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం..ఏలూరు జిల్లా నుంచి తీర్థయాత్రలకు వచ్చిన ముసునూరు మండలం గ్రామస్తులు నంద్యాల శ్రీనివాసరావు(27) అతని బంధువులు మొత్తం 12 మంది అంతర్వేది, అయినవిల్లి, కోటిపల్లి పుణ్యక్షేత్రాలు దర్శించుకున్నారు. అనంతరం కోటిపల్లి నుంచి ద్రాక్షారామం భీమేశ్వర స్వామి ఆలయానికి వెళ్లేందుకు ఆటోలో బయలుదేరారు. కుందూరు వచ్చేసరికి వేగంగా వస్తున్న మరో మోటార్ సైకిల్ ఆటోను ఢీకొట్టడంతో ఆటో బోల్తా పడింది. దీనితో ఆటో కింద పడిపోయిన నంద్యాల శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. యువకుడు అవివాహితుడు. మిగిలిన వారిలో ఒక మహిళకు గాయాలు కాగా మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. విహారయాత్రలకు వచ్చిన వారికి రోడ్డు ప్రమాదంలో యువకుడిని కోల్పోవడంతో ఆ కుటుంబ సభ్యులకు విషాదం మిగిలింది. మృతదేహాన్ని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయాలైన వారికి ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జానీబాషా తెలిపారు.

విద్యుత్ వైర్ చోరీ

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో విద్యుత్ మోటార్ సంబంధించిన 100 మీటర్ల వైరు శనివారం రాత్రి చోరీకి గురైయిందని ఆసుపత్రి అభివృద్ధి అధికారి జానకిదేవి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు.

ఇటుక బట్టీ వద్ద బోల్తాపడిన లారీ

మట్టి లారీ బోల్తా డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - ఆలమూరు

మట్టి లారీ ప్రమాదవశాస్తూ ఆదివారం అదుపుతప్పి బోల్తాపడగా డ్రెయివర్ మృతి చెందాడు. ఆదివానం ఎస్ఐ ఎల్.శ్రీనునాయక్ తెలిపిన వివరాలు ప్రకారం.. కొత్తపేట మండలంలోని ముద్దులమెరకకు చెందిన చుట్టుకోళ్ల పెద్దిరెడ్డి రాజు(32) ఐదేళ్లుగా రావులపాలెంకు చెందిన లారీ ఓనర్ రంగారెడ్డి వద్ద డ్రయివర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం వేకువజామున మట్టి లోడు లారీతో మండలంలోని చొప్పెల్ల జాతీయ రహదారి పక్కనగల ఇటుక బట్టి వద్దకు వచ్చాడు. అక్కడ రాజు మట్టిని అన్లోడింగ్ చేస్తున్నాడు. ఈ సమయంలో లారీ అదుపుతప్పి పక్కనున్న గోతులోనికి తలకిందులుగా పల్టీ కొట్టి పడిపోయింది. దీంతో రాజుకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు ఆలమూరు సిహెచ్‌సికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్న సమయంలో పరిస్థితి విషమించి అతను మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపారు.

ఉపాధి కల్పనే లక్ష్యంతో సేవలందిస్తా

ప్రజాశక్తి - కాకినాడ

కియేటర్స్ మీట్ లో మాట్లాడుతున్న జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్

కాకినాడ పార్లమెంటు పరిధిలోని యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా సేవలందిస్తానని జనసేన పార్టీ కాకినాడ పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సోషల్ మీడియా వల్ల అధిక నిజాలు ప్రచారమవుతాయని, దీనిని జీర్ణించుకోలేని వైసిపి ప్రభుత్వం సుమారుగా ఏడు వేల మందిపై అక్రమంగా కేసులు పెట్టిందన్నారు. ఇలా కేసులు నమోదు చేయడంలో రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందన్నారు. రాష్ట్రంలో సిఎం జగన్ ఇసుక, మద్యం, మైనింగ్ మాఫియా సాగిస్తున్నారని, అలాగే కాకినాడ వైసిపి తరపున ఎంపీగా పోటీ చేస్తున్న చలమలశెట్టి సునీల్ కండువాలు మార్చి వందలాది కోట్ల సంపాదన లక్ష్యంగా చేసుకుంటున్నారన్నారు. ఎవరైనా ఓడిపోతే ఆర్థికంగా నష్టపోతారని కానీ సునీల్ మాత్రం పార్టీలు మార్చి ఓడిపోయి వందలాదికోట్లకు అధిపతి అవుతున్నారని చెప్పారు. కాకినాడ పార్లమెంటు పరిధిలో అవినీతి లేని పాలన ఉద్యోగ, ఉపాధి కల్పించి మన్నలను పొందుతానని ఉదయ్ చెప్పారు. అనంతరం 45వ డివిజన్ కు చెందిన పలువురు జనసేన పార్టీలో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఏ అశోక్

నమశ్శివాయం గెలుపు తథ్యం

ప్రజాశకక్తి - యానాం

పుదుచ్చేరిలోక్ సభ స్థానానికి జరిగిన ఎన్నికల్లో బిజెపి, ఎన్ఆర్ కాంగ్రెస్ కూటమి అభ్యర్థి నమశ్శివాయం గెలుపు తథ్యమని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్అశోక్ జోస్యం చెప్పారు. ఆదివారం స్థానిక పెద్దిరెడ్డి కృష్ణ వినాయకరావు యానం కాపు కళ్యాణ మండపంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపి శ్రేణులు పార్టీ కార్యకర్తలు, గొల్లపల్లి అభిమానులు ప్రణాళికాబద్ధంగా ప్రచారం చేయడంతోపాటు ఓటర్లను చైతన్యవంతం చేయడం ద్వారా మెరుగైన పోలింగ్ శాతం సైతం నమోదయ్యిందన్నారు. తాను సైతం ఎప్పటికప్పుడు ఆయా పోలింగ్ బూత్‌ల పరిధిలోని కార్యకర్తలతో మాట్లాడుతూ పోలింగ్ సరళిపై సమీక్షించినట్లు తెలిపారు. యానాం నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలుకు ఇచ్చిన హామీతోనే తాను కూటమి అభ్యర్థి విజయానికి కృషి చేసినట్లు తెలిపారు. మల్లాడి కృష్ణారావు తాను కలిసిపోయామనే ప్రచారం అవాస్తవమని, దానిని ఎవరూ నమ్మవద్దన్నారు.

దవులూరి సతీమణి ప్రచారం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మూడవ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో వైసిపి పెద్దాపురం నియోజకవర్గ అభ్యర్థి దవులూరి దొరబాబు సతీమణి చంద్రకళ ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ ఛైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

23న కొత్తపల్లిలో పవన్ బహిరంగ సభ

ప్రజాశక్తి - పిఠాపురం

మీడియాతో మాట్లాడుతున్న ఎం.శ్రీనివాస్

జనసేన పార్టీ పిఠాపురం నియోజకవర్గ అభ్యర్థి పవన్ కళ్యాణ్ మంగళవారం నామినేషన్ దాఖలు చేస్తారని, అనంతరం ఉప్పాడ కొత్తపల్లిలో బహిరంగ సభలో పాల్గొంటారని జనసేన ఎన్నికల కోఆర్డినేటర్ ఎం.శ్రీనివాసు తెలిపారు. ఆదివారం కుమారపురం గ్రామంలోని గోకుల్ గ్రాండ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళవారం గొల్లప్రోలు నుంచి పిఠాపురం ఎంపిడిఒ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి నామినేషన్ దాఖలు చేస్తారన్నారు. అనంతరం సాయంత్రం ఉప్పాడ కొత్తపల్లిలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశామని, ఈ సభకు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు పిల్లా శ్రీధర్, చల్లా లక్ష్మి, కురుమళ్ళ రాంబాబు, ఎం రంగబాబు, దానం లాజర్ బాబు, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, తోలేటి శిరీష, సతీష్ పాల్గొన్నారు.

నేడు కాకినాడ, రూరల్ ఎంఎల్ఎలు నామినేషన్లు దాఖలు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

కాకినాడ అర్బన్, రూరల్ నియోజకవర్గాలకు చెందిన వైసిపి ఎంఎల్ఎలు ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి, కురసాల కన్నబాబు సోమవారం తమ నామినేషన్లు దాఖలు చేయనున్నారు. ద్వారంపూడి సోమవారం ఉదయం 8.30 గంటలకు స్థానిక ఆనందభారతి గ్రౌండు నుంచి పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా కార్పొరేషన్ కార్యాలయం చేరుకుని నామినేషన్‌ను దాఖలు చేస్తారు. అలాగే కాకినాడ రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు తన క్యాంపు కార్యాలయం నుంచి పార్టీ శ్రేణులతో ర్యాలీగా సర్పవరం జంక్షన్‌లోని తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని నామినేషన్‌ను దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు సిద్ధమయ్యాయి.

జనసేనలో పలువురు చేరిక

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

సమావేశంలో మాట్లాడుతున్న నానాజీ

స్థానిక రమణయ్యపేట, గైగల పాడు దుర్గమ్మ గుడి వీధిలో మాజీ ఉపసర్పంచ్ పాలిక రామ్మోహన్ ఆధ్వర్యంలో పలువురు జనసేన పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ అభ్యర్థి పంతం నానాజీ, టిడిపి నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, బాబి, దాయన రాంప్రసాద్ వారికి టిడిపి, జనసేన పార్టీల కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కోడి సత్తిబాబు, పాలిక వేణుబాబు, నరేంద్రకుమార్, కోడి రామకృష్ణ, వాసంశెట్టి నాని పాల్గొన్నారు.

మహారాజశ్రీ 3వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి మరియు J.F.C.M. వారి కోర్టు, రాజమహేంద్రవరం

I.A. No. 112/2022
O.S. No. 289/2021
I.A. No. 113/2022
O.S. No. 289/2021
I.A. No. 113/2022
O.S. No. 289/2021

Between:
Giduthuri Appa Rao
...Petitioner/ Plaintiff
AND
1) Giduthuri Veerabhadra Rao
2) Maleti Ganga Bhavani (died)
3) Giduthuri Nooka Ratnam (died)
...Respondents/ Defendants
4) Meleti Subrahmanyeswara Rao
5) Meleti Vaishnavi
6) Meleti Chinnari
...Proposed Parties/ LRS of 2nd Respondent

To:
R-4: Meleti Subrahmanyeswara Rao, S/o. Satyam, Hindu, aged about 66 years, Retd. Employee, R/o. D.No. 19-2/3, Jagannadhapuram, Kakinada Urban, Kakinada Dist.,

R-5: Meleti Vaishnavi, D/o. Subrahmanyeswara Rao, Hindu, aged about 22 years, R/o. D.No. 19-2/3, Jagannadhapuram, Kakinada Urban, Kakinada Dist.,

R-6: Meleti Chinnary, D/o. Subrahmanyeswara Rao, Hindu, aged about 19 years, R/o. D.No. 19-2/3, Jagannadhapuram, Kakinada Urban, Kakinada Dist.,

పై నెంబరు గ్రంథంలో 4, 5, 6 రెస్పాండెంట్స్/ ప్రతివాదులు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 30-4-2024 సం။రం తేదీ ఉదయం 10.30 ని။లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై గ్రంథంలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు గ్రంథంను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

రాజమండ్రి **డి.అప్పారావు**
20-4-2024 అడ్వకేట్, రాజమండ్రి

స్మార్ట్ సిటీలో పోలింగ్ శాతం పెంచాలి

ప్రజాశక్తి - కాకినాడ

సార్వత్రిక ఎన్నికల్లో స్మార్ట్ సిటీ కాకినాడ అసెంబ్లీ పోలింగ్ శాతాన్ని పెంపుదలకు కృషి చేయాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు ఓ ప్రకటనలో కోరారు. 1989-94లో 78 శాతం నుంచి 81 శాతంకు పెరిగిందన్నారు. 1999లో 69 శాతం 2009లో 72.85 శాతం ఉండగా 2014, 2019లో 67 శాతం మాత్రమే పోలింగ్ జరిగిందన్నారు. 34 శాతం మంది ఓటింగ్ వేయడానికి రావడం లేదన్నారు. మే13న ఘాటైన వేసవి ఎండల్లో జరగ నున్న 2024-29 ఎన్నికల్లో ఎండలకు భయపడి పోలింగ్ కేంద్రాలకు వచ్చి లైన్లలో నిలబడి ఓటు వేసే పరిస్థితి మరింత తగ్గే సూచికగా ఉందన్నారు. మే13న ఉదయం వేళల్లోనే సీనియర్ సిటిజన్స్ మహిళలు పోలింగ్ కేంద్రాలకు వేకువగా తరలివచ్చి ఓటు హక్కు వినియో గించుకునే విధంగా చైతన్య పర్చాలని కోరారు.

తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం 8వ జిల్లా జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

A.S. 20/2022

Between:
దాసరి వీర వెంకటరమణ
-అప్పిలెంటు
మరియు
శ్రీ కృష్ణ మందిరము కమిటీ
మరియు ఇతరులు **-రెస్పాండెంట్సు**

7వ రెస్పాండెంటు:
తూము సత్యనారాయణ, S/o. కృష్ణ, C/o. శ్రీకృష్ణ మందిరము కమిటీ, సుంకరవారి వీధి, శేషయ్యమెట్ట, రాజమండ్రి.

పై నెంబరు A.S. గ్రంథములో ఎన్నిసార్లు 7వ రెస్పాండెంటుకు నోటీసు పంపిన అమలు జరగనందున ఈ ప్రకటన ద్వారా 7వ రెస్పాండెంటుకు తెలియపరచునది ఏమనగా పై A.S. 20/2022 గ్రంథము వాయిదా **ది. 29-4-2024న ఉన్నది.** కావున 7వ రెస్పాండెంటు స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ యొక్క వాదనలు తెలియపరచుకొనవలెను. లేనియెడల శ్రీ కోర్టు వారు మీకు పరోక్షముగా తీర్మానము చేయుదురు అని తెలియచేయడమైనది.

కె.భరణికుమార్, అడ్వకేట్
రాజమండ్రి, సెల్: 9848315163

వేళంగిలో ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - కరప

ప్రచారం నిర్వహిస్తున్న పిల్లి దంపతులు

మండలంలోని వేలంగి గ్రామంలో టిడిపి నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి, పంతం సందీప్‌లు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు వెంకన్నరావు చౌదరి, జమ్మిల ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్. జయేంద్రబాబు, సర్పంచ్ మారెళ్ళ శ్రీనివాస రావు, మండల అధ్యక్షులు పట్టాభి పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థి ఉదయ్‌శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న అభిమానులు

కూటమి అభ్యర్థుల విజయానికి కృషి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రాబోయే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని ఆంధ్ర కాపు సద్భావన సంఘం అధ్యక్షులు, రాష్ట్ర కాపు జెఎసి కన్వీనర్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు పిలుపునిచ్చారు. కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ఇంటికి ఆదివారం వాసిరెడ్డి ఏసుదాసు దంపతులు మర్యాదపూర్వకంగా వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనకు ఎంపీ అభ్యర్థి ఉదయ్ శ్రీనివాస్ పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏసుదాసు మాట్లాడుతూ టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థిగా కాకినాడ పార్లమెంటు స్థానానికి పోటీ చేస్తున్న ఉదయ్ శ్రీనివాస్‌ను గెలిపించుకునేందుకు పంచాయతీ ఎన్నికల మాదిరిగా ఇంటింటికీ వెళ్లి ఓటర్లను అభ్యర్థించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. అనంతరం కాకినాడ రూరల్ జనసేన అభ్యర్థి పంతం నానాజీ, కాకినాడ రూరల్ మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి, టిడిపి రూరల్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

నేడు గీత, రేపు పవన్ నామినేషన్లు దాఖలు

ప్రజాశక్తి - పిఠాపురం

వైసిపి పిఠాపురం నియోజకవర్గ అభ్యర్థి వంగా గీత సోమవారం నామినేషన్‌ను దాఖలు చేయనున్నారు. అలాగే మంగళవారం ఇదే నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ అభ్యర్థిగా ఓటీ చేస్తున్న పవన్ కల్యాణ్ తన నామినేషన్‌ను దాఖలు చేయనున్నారు. 18వ తేదీన నామినేషన్లకు నోటిఫికేషన్ విడుదలైనప్పటికి గత మూడు రోజుల వ్యవధిలో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. అలాగే జై భీమ్ రావ్ భారత్ పార్టీ అభ్యర్థిగా జగ్గారపు మల్లిఖార్జునతోపాటు, మరో నలుగురు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేసేందుకు సన్నహాలు చేసుకుంటున్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మాదేపల్లి సత్యానందరావు నామినేషన్‌ను దాఖలు చేయనున్నారు.

దుగ్గుదూరులో మాట్లాడుతున్న బాబ్జి

నేడు సుభాష్ నామినేషన్ దాఖలు

ప్రజాశక్తి - కాజులూరు

టిడిపి రామచంద్రపురం నియోజకవర్గ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ సోమవారం నామినేషన్ దాఖలు చేయనున్నారని టిడిపి మండల అధ్యక్షుడు పేపకాయల బాబ్జి తెలిపారు. ఆదివారం మండలంలోని దుగ్గుదురు గ్రామంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ మండలంలోని టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సోమవారం ఉదయం 8 గంటలకు దాక్షారామ భీమేశ్వర స్వామి ఆలయం వద్దకి చేరుకోవాలని కోరారు. అక్కడ నుంచి ర్యాలీగా బయలుదేరి రామచంద్రపురం ఆర్‌డిఒ కార్యాలయంలో నామినేషన్ వేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో సలాది వీరబాబు, పోతు పరమేశ్వరరావు, చింతపల్లి నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

పిల్లలకు పాలు పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని కాండ్రకోట గ్రామంలో నూకాలమ్మ జాతరకు వచ్చిన యాత్రికుల పిల్లలకు ఆ గ్రామానికి చెందిన గీతా శివ భక్త సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంస్థ సభ్యులు రెడ్డి బాబులు, ఎలిసెట్టి వెంకటేశ్వరరావు, గంటా రామస్వామి, ఊటా నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

అనాలోచిత నిర్ణయాలతో జీవితాలు నాశనం

ప్రజాశక్తి - గండేపల్లి

సమావేశంలో మాట్లాడుతున్న తోటకూర గంగాధర్

విద్యార్థులం క్షణికావేశంలో అనాలోచితంగా ఆలోచించి జీవితాలను నాశనం చేసుకోవడం సరికాదని స్పందన ఇంటర్నేషనల్ ఫౌండేషన్ కాకినాడ జిల్లా శాఖ ప్రతినిధి, పర్యావరణ మిత్ర తోటకూర గంగాధర్ అన్నారు. ఆదివారం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ గ్రంథాలయ విభాగంలో జాతీయ పౌర సేవల దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భ:గా ఆయన మాట్లాడుతూ పరీక్షల్లో ఉత్తీర్ణిత సాధించలేకపోయామన్నా బాధతో విద్యార్థులు ఎంతో విలువైన జీవితాన్ని ఆవేశంతో అనాలోచితంగా ముగింపు పలకటం పిరికితనమేనని అన్నారు. కొందరు విద్యార్థులు తమ బంగారు భవిష్యత్‌ను, తల్లిదండ్రులు పిల్లలపై పెంచుకున్న ఆశలను అడియాశలు చేస్తున్నారని అన్నారు. గ్రంథాలయ విభాగం అధిపతి కె.అశోక్‌కుమార్ మాట్లాడుతూ పరీక్షల సమయంలో విద్యార్థులు మానసిక ధైర్యాన్ని కోల్పోకుండా పరీక్షా తప్పినా సప్లిమెంటరీ రాసి ఫలితాన్ని సాధించవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో కె.నాగబాబు, రమ్య, గ్రంథాల సిబ్బంది, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

ముద్రగడను కలిసిన వరుపుల

ప్రజాశక్తి - కిర్లంపూడి

కార్యకర్తలతో మాట్లాడుతున్న ముద్రగడ పద్మనాభం

వైసిపి నేత ముద్రగడ పద్మనాభంను వైసిపి ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సుబ్బారావు కిర్లంపూడిలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతోపాటు, ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం, ఏలూరు, పెద్దనాపల్లి గ్రామాలకు సంబంధించిన వైసిపి నాయకులు ముద్రగడను కలిశారు. ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ నియోజకవర్గంలో వరుపుల సుబ్బారావును గెలిపించాలని కోరారు. చంద్రబాబు అధికారంలో రావాలని పగటి కలలు కంటున్నారన్నారు. సినీ నటులను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు. వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ నా విజయానికి సహకారం అందించాలని ముద్రగడను కోరానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కాంట్రాక్టర్ గణేశుల రాంబాబు, గౌతు స్వామి, గణేశుల లచ్చబాబు, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు వేయండి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఐవి.రావు

నిర్భయంగా బయటకు వచ్చి మనం ఓటు వేసినప్పుడే మనం ఏదైనా సాధించగలమని ప్రముఖ ఫిజిషియన్ డాక్టర్ ఐవి.రావు పిలుపునిచ్చారు. ఆదివారం కాకినాడలో బ్రాహ్మణత్వం స్థాపకులు రాయవరపు ప్రభాకర్ ఆధ్వర్యంలో చల్లా నిరంజన్ శ్రీనివాస్ అధ్యక్షతన విద్యుత్ నగర్ చల్లా వారి కళ్యాణ మండపంలో బ్రాహ్మణ ఆత్మీయ సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా చాలా నియోజకవర్గాల్లో బ్రాహ్మణ ఓటింగ్ నిర్ణయాత్మక శక్తిగా ఉన్నాయని, అయితే మన మధ్య ఉన్న అవగాహన లోపం వల్ల అవి కొందరి స్వార్థపరుల చేతుల్లో బంధీగా మారు తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ బ్రాహ్మణ సంఘాల ప్రాముఖ్యత అనవస రమని, ఎవరైతే తమ వృత్తిలో ఇతర బ్రాహ్మణులకు అండగా నిలుస్తారో అటువంటి వారికి అండగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రముఖ లాయర్ అయ్యగారి వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా బ్రాహ్మణులపై దాడులు జరిగినప్పుడు బ్రాహ్మణులకు అండగా సంఘాలు స్పందిస్తే, దానికి అనుగుణంగా రాజకీయ నాయకులు స్పందిస్తారని, అప్పుడే మనకు మరింత అండ లభిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ముంజులూరి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ సమాజ హితం కోరే బ్రాహ్మణులు మీద దాడులు చేయడం దుర్మార్గం అని, దాన్ని నివారించాలంటే మన మధ్య ఐక్యత ఎంతైనా అవసరమని పిలుపునిచ్చారు. చల్లా నిరంజన్ శ్రీనివాస్ మాట్లాడుతూ బ్రాహ్మణుడి వంటిపై చెయ్యి వేసినవాడిని అక్కడే అణగ తొక్కి నార తీయాలని తెలిపారు. రాయవరపు ప్రభాకర్ మాట్లా డుతూ ఎటువంటి రాజకీయ ఎజెండా కన్న బ్రాహ్మణుల మధ్య ఐక్యత ముఖ్యమన్నారు. ఈ సమావేశంలో జమలమడక రామశర్మ, పద్మనాభ స్వామి, ఎంఎస్ఎన్ చార్టీస్ రిటైర్డ్ ప్రిన్సిపల్ సిహెచ్‌వివి.రమణమూర్తి పాల్గొన్నారు.

రికార్డులను తనిఖీ చేస్తున్న అధికారులు

తనిఖీల్లో రూ 1.01 లక్షలు సీజ్

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో ఆదివారం నిర్వహించిన వాహన తనిఖీల్లో సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ 1,01,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ జె.సీతారామారావు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ఉండూరు బ్రిడ్జి ఎస్ఎస్‌టి చెక్ పోస్ట్ వద్ద స్టాటిక్ సర్వేలెన్సు టీం అధికారి హౌసింగ్ ఇఇ కె.వెంకటరాజుగుప్తా ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా శైలజ అని మహిళ వద్ద ఈ నగదు లభ్యమైందన్నారు. దీనికి సంబంధించి సరైన పత్రాలు లేకపోవడంతో నగదు సీజ్ చేసి కాకినాడ ట్రెజరీకి జమ చేసినట్లు తెలిపారు.

నెహ్రూ కుమార్తె ప్రచారం

ప్రజాశక్తి - కిర్లంపూడి

మండలంలోని బూరుగుపుడి గ్రామంలో టిడిపి జగ్గంపేట నియోజకవర్గ అభ్యర్థి జ్యోతుల నెహ్రూ గెలుపు కోసం ఆయన కుమార్తె తోట సునీత ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి ఎన్నికల మ్యేనిఫెస్టోకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. వచ్చే నెల 13న జరిగే ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి జ్యోతుల నెహ్రూకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ఉపాధ్యక్షుడు పాటంశెట్టి రవి, కుంచే తాతాజీ, కర్నాకుల పెద్దకాపు, బాలుకల చిన్నోడుపాల్గొన్నారు.

ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

జన విజ్ఞాన వేదిక, మద్యం, మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచార కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కుమ్మరి వీధిలోని సంత మార్కెట్ పరిసరాల్లో ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలంటూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ కన్వీనర్ ఎం.సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. మద్యపాన రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఎన్నికల సమయంలో ఎక్కువ మంది యువత మద్యంకు బానిసలయ్యే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని యువతను మద్యం భారీ నుంచి కాపాడేలా ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు చంటి, తరుణ్, ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

వయోపరిమితి తొలగించడం పట్ల హర్షం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

ఆరోగ్య బీమా పొం దడానికి వయోపరిమితి తొల గించడం హర్షనీయమని సీని యర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు బుద్ధరాజు సత్యనారాయణ రాజు అన్నారు. ఆదివారం బోటు క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లా డారు. ఆరోగ్య బీమా పొందడానికి ఇప్పటివరకు ఉన్న 65 ఏళ్ల పరిమితిని తొలగించడం హర్షనీయమన్నారు. దీనివలన 65 ఏళ్లు పైబడిన వారు కూడా ఆరోగ్య బీమా పొందే అవకాశం లభించిందన్నారు. క్యాన్సర్, గుండె, కిడ్నీ జబ్బులు, హెచ్‌ఐవి వంటి తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్నవారు కూడా ఆరోగ్య బీమా పొందడానికి అవకాశం కల్పించడం బీమా రంగంలో ఒక విప్లమాత్మకమైన మార్పు అని అన్నారు. ఆరోగ్య బీమా తీసుకున్న తర్వాత 48 నెలల వెయిటింగ్ పీరియడ్ను 36 నెలలకు తగ్గించడం సంతోషదాయకమైనా వెయిటింగ్ పిరియడ్‌ను పూర్తిగా తొలగిస్తే రోగులకు ఎంతో మేలు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రమణ మూర్తి, రాఘవరావు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న సత్యనారాయణ రాజు

నూకాలమ్మ జాతరకు పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - పెద్దాపురం

ఆలయానికి పోటెత్తిన యాత్రికులు

మండలం కాండ్రకోట గ్రామంలో 45 రోజులపాటు జరిగే నూకాలమ్మ జాతరకు ఆదివారం అధిక సంఖ్యలో యాత్రికులు అమ్మవారిని దర్శించుకునేందుకు రావటంతో ఆలయ పరిసరాలు, వీధులన్నీ జనమయంగా మారిపోయాయి. ఆలయ ఛైర్మన్ గవరసాన వీరాస్వామి, ఆలయ కార్య నిర్వహణాధికారి తలాటం వెంకట సూర్యనారాయణల ఆధ్వర్యంలో యాత్రికులు క్యూ లైన్‌లలో గంటల తరబడి అవస్థలు పడకుండా వేగవంతంగా దర్శనం చేసుకునేలా చర్యలు తీసుకున్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని యాత్రికులకు మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్తలు భావిశెట్టి గంగరాజు, రొంగల తమ్మారావు, లక్కాకుల కృష్ణ, మండా త్రిమూర్తులు, గ్రామ ప్రజలు యాత్రికులకు సహాయ సహకారాలు అందించారు.

వసతి గృహంలో విద్యార్థుల అవస్థలు

- వెలగని లైట్లు-తిరగని ఫ్యాన్ లు,
- చీకట్లో హాస్టల్ విద్యార్థులు.
- పలువురికి చర్మ వ్యాధులు,
ఈగల, దోమలతో ఇబ్బందులు

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండల ప్రధాన కేంద్రంలో గల సాంఘిక సంక్షేమ శాఖ బాలుర హాస్టల్లో లైట్లు వెలగటం లేదు. దీంతో పాటుగా ఇక్కడ ఫ్యాన్లు కూడా తిరగడం లేదు. విద్యార్థులంతా గత రెండు నెలలుగా ఫ్యాన్లు తిరగక ఇబ్బందులు పడుతున్నారు. చీకట్లోనే విద్యార్థులు కాలం గడపవలసి వస్తోంది. మరోవైపు లైట్లు వెలగకపోవడం ఫ్యాన్లు తిరగకపోవడంతో ఈగలు దోమలు వాళ్ళని చుట్టుముడుతున్నాయి. సుమారు 60 మంది విద్యార్థులు ఉన్న ఈ హాస్టల్లో అధిక శాతం మందికి చర్మవ్యాధులు దురదలతో బాధపడుతున్నామని 'ప్రజాశక్తి'కి వివరించారు. గత నెలలో దీనిపై 'ప్రజాశక్తి' దినపత్రికలో వార్త ప్రచురితమైన నేటికీ ఫ్యాన్లను రిపేర్ చేయలేదు సరిగదా కొత్త వాటిని ఏర్పాటు చేయలేదు. దీంతో పాటుగా లైట్లు కూడా వెళ్ళలేకపోవడంతో చిన్నారులు ఎవరికి చెప్పాలో తెలియక సతమతమవుతున్నారు. హాస్టల్ లో వెంటనే ఫ్యాన్లు వేయించాలని లైట్లు వేయాలని విద్యార్థుల చర్మ వ్యాధులకు వైద్యుల చేత పరీక్షలు చేసి మందులు ఇప్పించాలని హాస్టల్ విద్యార్థులు కోరుతున్నారు.

గత రెండు నెలలుగా పాడై తిరగని ఫ్యాన్లు

వార్డెన్ వివరణ

దీనిపై హాస్టల్ వార్డెన్ ఎ.శ్రీనివాసరావు వివరణ కోరగా ఫ్యాన్లు రెండు రోజుల్లో వేయిస్తామని విద్యుత్తు లైట్లు కూడా బాగు చేస్తామని చెప్పారు.

చీకటి గది చీకట్లో కూర్చున్న విద్యార్థులు

అయితే రెండు నెలలుగా పట్టించుకోని వార్డెన్ రెండు రోజుల్లో వేస్తామంటే నమ్మశక్యంగా లేదంటూ విద్యార్థులు తల్లిదండ్రులు వ్యాఖ్యానిస్తున్నారు. మరమ్మతులు పూర్తి చేసి విద్యార్థులకు వైద్యచికిత్స అందించాలని వారు కోరుతున్నారు.

చలి వేంద్రాలను ఏర్పాటు చేయాలి

జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

ప్రజాశక్తి-అమలాపురం

వేసవిలో ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి బంధువులకు మరియు ఇతర పనుల నిమిత్తం వచ్చే ప్రయాణికుల దాహార్తిని తీర్చడంలో దాతలు ముందుకు వచ్చి మరిన్ని చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆకాంక్షించారు ఆదివారం స్థానిక ప్రాంతీయ ఆ సుపత్రి వద్ద జిల్లా కలెక్టర్ వారి సౌజన్యంతో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ప్రారంభించారు. అనంతరం బాటచారులకు ఆసుపత్రికి వైద్య సేవల నిమిత్తం వచ్చేవారికి మజ్జిగను, కూల్ డ్రింక్స్ ఉచితంగా జిల్లా కలెక్టర్ వారి తండ్రి ఎం.ఎల్ శుక్లా, తనయుడు రియెన్ష్ శుక్లా లు పంపిణీ చేశారు.. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి మండు టెండలు నేపథ్యంలో దాతలకు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆలోచన రావడం గొప్ప విషయమన్నారు. ఎండకాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ముందుకు వచ్చిన పలువురు దాతలను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున చిన్నారులు, వద్ధులు జాగ్రత్తగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ సూచనల మేరకు మరి అత్యవసరమైతే తప్ప ఎట్టి పరిస్థితులలోనూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం నాలుగు గంటల వరకు బయట సంచరించ వద్దని సూచించారు. చలివేంద్రం అనేది ప్రజల దాహార్తిని తీర్చేందుకు దాతల సహాయంతో ఏర్పాటు చేయబడిన ఉచిత మంచి నీటి కేంద్రమని. కొత్త కుండలలో మంచినీటిని నింపడం వలన ఈ నీరు చల్లగా ఉంటుందని. వీటిని ఎక్కువగా రద్దీగా ఉండే ప్రధాన రోడ్ల కూడలి ప్రదేశాల్లో ఏర్పాటు చేయా లని సూచించారు. ప్రజలకు ఎక్కువ గా దాహం వేసే వేసవి కాలంలో చలివేంద్రాలను ఏర్పాటు చేయడం మన పూర్వీకుల నాటి నుండి ఆనవాయితీగా వస్తోందన్నారు వైద్య సేవల నిమిత్తం ఆసుపత్రికి వచ్చే రోగులు వారి బంధువుల దాహార్తిని తీర్చడంలో ఈ చలివేంద్రం కీలకం కానున్నదన్నారు. వివిధ పనుల నిమిత్తం వచ్చే ఇతర గ్రామస్తులకు, ముఖ్యంగా పేదవారికి ఈ చలివేంద్రాలు ఎంతో ఉపకరిస్తాయన్నారు. ఎండలు విపరీతంగా ఉన్న కారణంగా స్వచ్ఛమైన తాగునీటిని అందించనున్నట్లు, అదేవిధంగా మజ్జిగను పంపిణీ చేస్తారని తెలి పారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్రావు వైద్యాధికారులు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రి వద్ద చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ కుటుంబ సభ్యులు

'సి-విజిల్' ద్వారా అందిన ఫిర్యాదులపై చర్యలు : సిపిఒ

ప్రజాశక్తి-అమలాపురం

త్వరలో నిర్వహించనున్న పార్లమెంట్ అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై సి విజిల్ ద్వారా అందిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యలు ఈ విధంగా ఉన్నాయని సిపిఒ వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సి -విజిల్ యాప్ ద్వారా పౌరులు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనల పై అందిన ఫిర్యాదుల రోజువారి నివేదిక ప్రకారం ఈ నెల 20 వ తేదీన 7 ఫిర్యాదులు ఎన్నికల ప్రవర్తన నియమాలు ఉల్లంఘనలపై రాగా వాటిలో ఒకటి ఎన్నికల ప్రవర్తన నియమావళికి సంబం ధించినది కాదని ధ్రువీకరించి మిగిలిన 6 ఫిర్యాదులను వంద నిమిషాల లోపు పరిష్కరించామని సిపిఒ వెంకటేశ్వర్లు తెలిపారు. సి విజిల్ యాప్ ద్వారా గత నెల 16 వ తేదీ నుండి ఇప్పటివరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి 462 ఫిర్యాదులు రాగా వాటిలో 92 ఫిర్యాదులు ఎన్నికల ప్రవర్తన నియమావళికి సంబంధించినవి కావని ధ్రువీ కరించామన్నారు మిగిలిన 370 ఫిర్యాదులు లో 100 నిమిషాల లోపు 335 ఫిర్యాదులను పరిష్కరించామన్నాయరు. 35 ఫిర్యాదులను వంద నిమిషాలు పైబడిన తర్వాత పరిష్కరించామన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వారి ద్వారా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించి గత నెల 16వ తేదీ నుండి ఈ నెల 20 వ తేదీ వరకు 33 ఫిర్యాదులు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనల పై వచ్చాయన్నారు. వీటిలో 31 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. పెండింగ్ లో ఉన్న రెండు ఫిర్యాదులలో ఒకటి పి.గన్నవరం అసెంబ్లీకి, మరొకటి కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గానికి చెంది ఉన్నాయన్నారు.

వేసవిలో నీటిని ఎక్కువగా తీసుకోవాలి

డాక్టర్ పరిమి వినోద్

ప్రజాశక్తి - నిడదవోలు

వేసవిలో నీటిని ఎక్కువగా తీసుకోవాలని స్వాతి హాస్పిటల్ డాక్టర్ పరిమి వినోద్ అన్నారు. గాంధీనగర్ వాకర్స్ క్లబ్, మహిళా వాకర్స్ క్లబ్బుల నాలుగో సర్వసభ్య సమావేశం ఆదివారం రాజేశ్వరి రామకృష్ణ లైన్స్ కంటి హాస్పిటల్ నందు నిర్వహించారు. ఈ సమావేశానికి డాక్టర్ పరిమి వినోద్ హాజరై ఆరోగ్యకరంగా ఉండటానికి అవసరమైన అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంట గంటకు నీళ్ళ తాగాలన్నారు. అయితే వేడి ఎక్కువగా ఉందని మరీ చల్లగా ఉండే నీళ్ళ తాగకూడదన్నారు. తీయదనం కోసం కూల్ డ్రింక్స్, ఎనర్జీ డ్రింక్స్ ఆర్టిఫిషియల్ జ్యూసులు తాగకూడదు అన్నారు. టీ, కాఫీలు, కూడా తగ్గించాలన్నారు. ఇవి ఎక్కువగా తాగడం వల్ల దాహం తీరదని, పైగా మరింత పెరుగుతుంది అని అన్నారు. వీటిలో ఉండే కెమికల్స్, చక్కెర ఎండ దెబ్బకు గురై దాహాన్ని పెంచుతాయని అన్నారు. అందుకే వేసవిలో చెమట రూపంలో వెళ్లిపోయిన నీటిని భర్తీ చేసే డ్రింక్స్ ఎక్కువగా తాగాలని, లేదంటే డీ హైడ్రేషన్ బారిన పడే ప్రమాదం ఉంది అని అన్నారు. కొబ్బరినీళ్ళు, చెరుకు రసం, మజ్జిగ, లస్సి, పళ్ళ రసాలు, నిమ్మరసాలు వంటి సోడియం , పొటాషియం ఉండే డ్రింక్స్ తాగితే లాభం ఎక్కువగా ఉంటుందని అన్నారు. అనంతరం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ పరిమి వినోద్ కు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఖండవల్లి మాణిక్యాలరావు, జిల్లా గవర్నర్ శనగన కష్ణమూర్తి, సెక్రెటరీ నారాయణ, మరియు మహిళా వాకర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పరిమి వినోద్

సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపితే చర్యలు

ప్రజాశక్తి-గోకవరం

వాహనదారులు డ్రయివింగ్ చేసేటప్పుడు సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపితే చర్యలు తప్పవని గోకవరం ఎస్ఐ నాగరాజు అన్నారు. ఆయన విలేకరులతో ఆదివారం మాట్లా డుతూ వాహన దారులు డ్రయివింగ్ చేసేటప్పుడు సెల్ ఫోన్ మాట్లాడుతూ ప్రమాదాల బారిన పడవద్దన్నారు. తల్లిదండ్రులు తమ వాహనాలను పిల్లలకు ఇవ్వరా దన్నారు. వారికి వాహనాలు ఇస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నాగరాజు,ఎస్ఐ, గోకవరం

నేడు వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థిగా చిర్ల నామినేషన్

ప్రజాశక్తి - ఆలమూరు

నేడు వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి సోమవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. 22న సోమవారం ఉదయం 9 గంటలకు రావులపాలెం పార్టీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా బయలుదేరి కొత్తపేట ఆర్డిఒ ఆఫీస్ నందు వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థిగా చిర్ల జగ్గిరెడ్డి నామినేషన్ దాఖలు చేయనున్నారని వైసిపి నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ ప్రజలందరూ హాజరై ఆశీర్వదించ వలసినదిగా వారు కోరుతున్నట్లు తెలిపారు.

ప్రజలకు మేనిఫెస్టో వివరిస్తున్న బండారు సంజీవ్

ఇంటింటా సంజీవ్ ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని బడుగువానిలంకలో ఆదివారం ప్రజాగళం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తపేట నియోజకవర్గ టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఎంఎల్ఎ అభ్యర్థి బండారు సత్యానందరావు తనయుడు యువనేత బండారు సంజీవ్ ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలతో కలసి హాజరై ఆదివారం ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అలాగే మేనిఫెస్టో వివరాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి, జనసేన, బిజెపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండుటెండలో ప్రచారం నిర్వహిస్తున్న పిల్లి సూర్యప్రకాష్

మండుటెండలో ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-రామచంద్రపురం

సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడటంతో ఎన్నికల ప్రచారంలో వేడి మరింత పెరిగింది. దీంతో ఎంత ఎండల నైనా లెక్కచేయకుండా నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహిస్తున్నారు. భరించలేని ఎండలోను మధ్యాహ్నం వరకు ప్రచారాలు నిర్వహించి ఎన్నికల వేడి ముందు ఎండల వేడి ఒక లెక్క అన్నట్లు వ్యవహరిస్తున్నారు. మరోవైపు ఎండల వేడికి రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారి కర్ఫ్యూ వాతావరణం తలపిస్తున్నప్పటికీ పంట పొలాల్లో కి వెళ్లి అక్కడ కూడా పార్టీలను బలపరచాలని ఓట్లు వేయాలని అభ్యర్థిస్తున్నారు. దీంతో వారు రాత్రి పగలు తేడా లేకుండా ఎన్నికల ప్రచారాలు కొనసాగిస్తున్నారు.

టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ఎన్నికల ప్రచారకర్తల నియామకం

ప్రజాశక్తి-మండపేట

మండపేట పట్టణానికి చెందిన రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి సల్మాన్ హుస్సేన్, కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ మౌలానా లను రాష్ట్ర ముస్లిం మైనారిటీ ఎన్నికల ముఖ్య ప్రచారకర్తలుగా టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరపు అచ్చెన్నాయుడు నియమించారు. ఈ సందర్భంగా సల్మాన్ హుస్సేన్ మౌలానాలు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. తమపై పార్టీ పెట్టిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు, మండపేట నియోజకవర్గంలో టిడిపి కూటమి అభ్యర్థి వేగుళ్ళ జోగేశ్వరరావు గెలుపు కోసం కషి చేస్తామని స్పష్టం చేశారు. మైనార్టీలకు అండగా నిలిచేది కేవలం టిడిపి మాత్రమేనని పేర్కొన్నారు. వైఎసిపి చేస్తున్న దుష్ప్రచారాలను నమ్మవద్దని వారు పేర్కొన్నారు.

తాగునీరున్నా ట్యాంకుల్లేక జనం అవస్థలు

ప్రజాశక్తి-గోపాలపురం

సత్యసాయిబాబా పథకం తాగునీరు అందించేందుకు అవకాశం ఉన్నా వాటర్ ట్యాంకులు లేకపోవడంతో దొండపూడి వాసులు తాగునీటికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు మాత్రం చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని అన్నారు. పంచాయతీ నీరు అందించే ట్యాంక్‌లోకి సత్యసాయిబాబా నీరు ఎక్కించి అందించడం వల్ల పంచాయతీ నీరు సత్యసాయిబాబా నీరు రెండూ కలిసిపోయి రావడంతో రుచికరంగా ఉండడం లేదని, అనారోగ్యం పాలవుతున్నామని అన్నారు. ఉదయం, మధ్యాహ్నం పంచాయతీ ట్యాంకు ద్వారా బోరు నీరు అందిస్తున్నారని అన్నారు. సాయంత్రం సమయంలో కేవలం ఒక గంట మాత్రమే సత్యసాయిబాబా నీరు పంచాయతీ ట్యాంకులో ఎక్కించి మంచినీరు అందిస్తున్నారని ఆ సమయంలో కూలి పనులకు వెళ్లేవారు, ఇతర అవసరాలకు అత్యవసర పనుల నిమిత్తం బయటకు వెళ్లి వచ్చేసరికి మంచినీరు ఉండడం లేదన్నారు. ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడిందన్నారు. అది కూడా సక్రమంగా, పూర్తిస్థాయిలో అందడం లేదని ఆవేదన చెందారు. గ్రామంలో పది వార్డులు ఉన్నాయని సుమారు 4000 మంది ఉన్నారని చెప్పారు. గ్రామంలో నీరు అందించేందుకు పంచాయతీ ట్యాంక్‌కు పూర్తి సామర్థ్యం లేకపోవడంతో నీరు కేవలం పదో వార్డు నుండి నాలుగో వార్డ్ వరకు మాత్రమే వస్తోందని తెలిపారు. 1, 2, 3 వార్డులకు ప్రత్యేకంగా మోటర్ ద్వారా బోరు నీరును అందిస్తున్నారని అన్నారు. ఈ మూడు వార్డులకు పంచాయతీ ట్యాంకు ద్వారా అందించే సత్యసాయిబాబా నీరు కూడా ఈ వార్డులో ప్రజలకు అందడం లేదని వాపోయారు. అయితే కొంతమంది పోలవరం మండలం రెడ్డినాగంపాలెం (ట్రైబల్ ఏరియా) ఆ గ్రామంలో సత్య సాయి బాబా మంచినీటి ట్యాంకులు ఉండడం చేత రెండు కిలోమీటర్ల దూరం వెళ్లి తీవ్ర అవస్థలు పడుతూ, ప్రయాసలతో సత్యసాయిబాబా నీరు తెచ్చుకుంటున్నామని వాపోయారు. మరికొందరు దొండపూడి శివారులో ఉన్న సత్యసాయిబాబా పైపులు ఎయిర్ వాల్ నుండి లీకేజ్ అవుతున్న నీటిని డబ్బాలలో నింపుకొని తెచ్చుకొని దాహార్తిని తీర్చుకుంటున్నామని తెలిపారు. సత్య సాయిబాబా నీరు అందించేందుకు ప్రత్యేక ట్యాంకులు అంటూ లేకపోవడంతో మంచినీరు కొరకు తీవ్ర అవస్థలు పడుతున్నామని అన్నారు. సత్య సాయి బాబా నీరు అందించేందుకు ప్రత్యేక ట్యాంకులు అంటూ ఉంటే 24 గంటలు నిరంతరం మంచినీరు కొరత లేకుండా మంచినీరు అందుబాటులో ఉంటుందని అన్నారు. ప్రత్యేక ట్యాంకులు లేకపోవడంతో పంచాయతీ ట్యాంకులో నిల్వ ఉన్న బోరు నీరు, గొట్టాలలో మిగిలి ఉన్న బోరు నీరు రెండు నీళ్లు కాస్త కలిసిపోయి అవి తాగి అనారోగ్యం గురవుతున్నామని, రుచికరంగా ఉండడం లేదని అన్నారు. అది ఏ నీరో తెలియక అయోమయ పరిస్థితిలో ఉంటున్నామని అన్నారు.గతంలో సత్యసాయిబాబా నీరు నిలుపుదల చేసిన సమయంలో అవంతి ఫ్యాక్టరీ వారు పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్ఓ వాటర్ ప్లాంట్ సత్యసాయిబాబా నీరు వస్తుందనే నెపంతో కొన్ని నెలలుగా మూత వేశారని అన్నారు. ఈ నీరు రూ.ఐదుకే అందించే వారని అది కాస్తా మూసివేయడంతో తాగునీటి కొరత అధికంగా ఏర్పడిందన్నారు. ప్రజలు దాహార్తి తీర్చుకునేందుకు పైపుల లీకేజ్ నీరు తాగుతున్నారు. మరికొందరు రెండు కిలోమీటర్ల దూరం వెళ్లి మంచినీరు తెచ్చుకుంటున్నట్టు చెప్పారు. ప్రజా ప్రతినిధులు మాత్రం చోద్యం చూస్తున్నారే తప్ప ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వ యంత్రాంగం ముందుకు రాకపోవడంతో ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రజా ఆరోగ్య అవసరాల దృష్ట్యా ప్రజల దాహార్తి తీర్చేందుకు సత్య సాయిబాబా మంచినీటి మినీ ట్యాంకులు ఏర్పాటు చేసి నిరంతరం మంచినీరు అందించేందుకు సహకరించాలని కోరారు. అవంతి ఫ్యాక్టరీ వారు పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను తిరిగి ప్రారంభించాలని కోరారు. దొండపూడి గ్రామంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో సత్యసాయిబాబా తాగునీరు అసలే అందడం లేదని, తమకు కూడా ఆ తాగునీరు అందించాలని వారు కోరారు.

ఎయిర్ వాల్ నుంచి లీకేజీ నీరు పట్టుకు వెళుతున్న గ్రామస్తులు

పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు

వేమగిరి తోటలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-కడియం

'వేమగిరి తోటలో పారిశుధ్యం అధ్వానం' అనే కథనం ఇటీవల ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై ఆ గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపిడిఒ జి.రాజ్‌మనోజ్ స్పందించారు. పూడుకుపోయిన డ్రైన్లు శుభ్రం చేయించారు. సంపులో నిల్వ ఉన్న మురుగునీటిని మోటార్ల సాయంతో బయటకు తోడించారు. సంపులో పేరుకుపోయిన వ్యర్థాలను ప్రత్యేక పారిశుధ్య కార్మికులతో తొలగించారు. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తూనే, తాత్కాలిక చర్యలు కాక శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. సుమారు రెండు దశాబ్దాల కాలంగా ఈ సమస్య ఉందని, తరచూ పారిశుధ్య పనులు చేపట్టి శుభ్రం చేయాల్సి వస్తోందని స్థానిక నాయకులు తెలిపారు. సంపు నుంచి రెండు మోటార్ల సాయంతో మురుగునీటిని దూరంగా పంపాల్సి వస్తోందన్నారు. శాశ్వత చర్యల్లో భాగంగా డ్రైన్ నిర్మాణానికి సుమారు రూ.40 లక్షల నిధులు మంజూరైనా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదన్నారు.

వార్డులో ప్రచారం చేస్తున్న ఎంపీ మార్గాని భరత్

41వ వార్డులో ఎంపీ భరత్ ప్రచారం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

రాజమండ్రి ఎంపీ, వైసిపి సిటీ ఎంఎల్ఎ అభ్యర్థి మార్గాని భరత్ రామ్ ఆదివారం నగరంలోని 41వ వార్డులో ప్రచారం చేశారు. కోటి లింగాలపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి, 3వ వార్డు ఉమెన్స్ కాలేజీ రోడ్డు రచ్చబండ వద్ద నుంచి 'గడప గడపకూ..' కార్యక్రమాన్ని వైసిపి శ్రేణులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ భరత్ ముఖ్య అతిథిగా పాల్గొని వీధి వీధికీ, ఇంటింటికీ వెళ్లి జగనన్న సంక్షేమ పాలన ఎలా ఉందని ప్రశ్నించారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని లబ్ధిదారులను ప్రశ్నించారు. అన్నీ సక్రమంగా అందుతున్నాయని, జగనన్న పాలన అద్భుతంగా ఉందని ఎంపీకి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ దేశంలోనే కాదు ప్రపంచంలోనే ఇంతటి చక్కని పాలన లేదన్నారు. సంక్షేమ పథకాలు ఎక్కడా నిలిపివేయకుండా ఒక నిర్దిష్టమైన విధానంలో లబ్ధిదారులకు అందించే తీరుపట్ల ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నాయన్నారు. ఎపిలోని వైసిపి ప్రభుత్వం విధంగా అమలు చేస్తోందో తెలుసుకోవడానికి గతంలో కొన్ని రాష్ట్రాల నుంచి అధికార, అనధికార బృందాలు కూడా అధ్యయనం చేయడానికి ఇక్కడకు వచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా ఎంపీ గుర్తు చేశారు. దేశానికే రోల్ మోడల్‌గా ఎపిలోని వైసిపి ప్రభుత్వం నిలుస్తుందన్నారు. సంక్షేమ పథకాల ద్వారా పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని కొన్ని సర్వే సంస్థలు కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు అందజేశాయని చెప్పారు. ఒక వైపు అభివద్ధి, మరోవైపు సంక్షేమం రెండు కళ్లుగా జగనన్న పాలన అందిస్తుంటే ప్రతిపక్షాలు కడుపుమంటతో విషం చిమ్ముతున్నాయన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటుకు అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత ప్రాధాన్యత కలిగి ఉందని రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకులు నీనా నిగమ్ పేర్కొన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన స్వీప్ ఫోటో ప్రదర్శనను కలెక్టర్ మాధవీలతతో కలిసి ఆమె తిలకించారు. అనంతరం నీనా నిగమ్ మాట్లాడుతూ, పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఓటు హక్కును వినియోగించుకునే శాతం తక్కువగా ఉందని, అటువంటి వారికి 85 ఏళ్ళు పైబడిన ఓటర్లు ముందుకు వచ్చి ఓటు వెయ్యడం స్ఫూర్తి కల్పిస్తుందని అన్నారు. ప్రతి ఎన్నికలల్లో వద్ధులు ఓటు హక్కును వెయ్యడమే కాక, గత 40 , 50 ఏళ్లలో తాము ఇన్నిసార్లు ఓటు వేసినట్లు పేర్కొనడం గమనార్హం అన్నారు. యువత ఇటువంటి వారిని నుంచి స్ఫూర్తి పొందేలా ప్రదర్శన నిర్వహించడం పట్ల కలెక్టర్‌ను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, జిల్లాలో 85 ఏళ్ళు పైబడిన వారిలో పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వెయ్యటానికి ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నట్టు తెలిపారు. వృద్ధుల కోసం ఇంటి వద్దనే ఓటు హక్కు వేసే అవకాశం ఉందని, ఆ క్రమంలో అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. కొత్తగా ఓటు హక్కు కలిగిన వారు కూడా తొలిసారి ఓటు హక్కును వేసేందుకు ఏంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని కలెక్టర్ తెలిపారు. అంతకు ముందు మీడిడా మానిటరింగ్ సెల్, చెక్ పోస్ట్‌లు, సిసి కెమేరాల ద్వారా పర్యవేక్షణ, సువిధ, సి విజిల్, ఎంసిసి, ఎంసి, తదితర విభాగాలను పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమన్వయ కమిటీల, నోడల్ అధికారులతో సీజర్ నిర్వహణా, ఖర్చుల వివరాలు, ఆడిటింగ్ సమీక్ష నిర్వహించారు. నామినేషన్ల పర్వం ప్రారంభం అయిన దష్ట్యా తనిఖీలు ముమ్మరం చేయాలని, సాధారణ పౌరులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం అన్నారు. ఎన్నికల కమిషన్‌కు కళ్లు, చెవులు, నోరుగా ఎన్నికల సిబ్బందిపై ఎంతో గురుతరమైన బాధ్యత ఉందన్నారు. స్వేచ్ఛగా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికలను నిర్వహించడంలో ఖర్చులను అభ్యర్థుల ఖాతాలకి చూపడంలో నిష్పక్షపాతంగా ఎన్నికల సిబ్బంది వ్యవహరించాలన్నారు.

ఫోటో ప్రదర్శన తిలకిస్తున్న వ్యయ పరిశీలకులు నీనా నిగమ్, కలెక్టర్ మాధవీలత

జిల్లాలో ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు చేసిన ఏర్పాట్లు, సన్నద్ధత ప్రణాళిక పట్ల నీనా నిగమ్ సంతృప్తి వ్యక్తం చేశారు. రిజిస్టర్ రాజకీయ పార్టీల అభ్యర్థులు, గుర్తింపు పొందని రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు వారు చేస్తున్న ప్రచార ఖర్చులు, బహుమతుల పంపిణీ, ఇతర ఖర్చులపై సమగ్ర దృష్టి పెట్టాలని సూచించారు. వాటిపై అభ్యర్థులకు అవగాహన కలిగి ఉండాలని, ఆ మేరకు అవగాహన కల్పించాలని సూచించారు. బ్యాంకుల నుంచి జరిగే అనుమానాస్పద నగదు లావాదేవీలు, భారీ మొత్తంలో జరిగే లావాదేవీలు, నగదు డిపాజిట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. మద్యం అమ్మకాలు, స్టాక్ షాపులకు వెళ్లే సరుకు రవాణాపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. భారీ ఎత్తున లావాదేవీల విషయంలో మరింతగా నిఘా పెట్టాలని ఆదేశించారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఖర్చుల పర్యవేక్షణ, ఎన్నికల ప్రచారాన్ని తనిఖీ చేయడానికి ఇప్పటికే ప్రత్యేక బందాలు తనిఖీలు ముమ్మరం చేయాలని తెలిపారు. క్షేత్ర స్థాయిలో పని చేస్తున్న తీరును వ్యయ పరిశీలకులు నీనా నిగమ్ అడిగి తెలుసుకున్నారు. వాటి విషయంలో పారదర్శకత జవాబుదారీతనం ఉండటం అత్యంత ప్రాధాన్యత కూడుకున్నదని నీనా నిగమ్ పేర్కొన్నారు. పత్రికలు, ఛానళ్ళు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం అవుతున్న అనుకూల, ప్రతికూల కథనాలు, చెల్లింపు వార్తలు తదితర అంశాలపై నీనా నిగమ్ అడిగారు. కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె.మాధవీలత మాట్లాడుతూ పారదర్శకంగా, సజావుగా ఎన్నికల ప్రక్రియలో ప్రత్యేక వ్యయ పరిశీలకులు సూచనలు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయన్నారు. ఎన్నికలలో అభ్యర్థులు చేసే ప్రచారం ర్యాలీలు పై ప్రత్యేక బందాలను ఏర్పాటు చేసి రికార్డు చేస్తున్నట్టు తెలిపారు. ఎస్‌పి పి.జగదీష్ మట్లాడుతూ జిల్లాలో తొలుత ఎనిమిది సమీకత చెక్ పోస్ట్‌లు ఏర్పాటు చేశామని, తదుపరి మరో ఎనిమిది చెక్ పోస్ట్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. పోలీస్, రెవెన్యూ, రవాణా, అటవీ, సెబ్, ఎక్సైజ్ తదితర శాఖల ఆధ్వర్యంలో సమ్మిళితం చేసి ఏకీకత శాఖల ఉద్యోగులు నియమించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్, డిఆర్ఒ జి.నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వ్యయం తడిసి మోపెడు

తలలు పట్టుకుంటున్న అభ్యర్థులు

ప్రజాశక్తి- రాజోలు

ప్రచారం సాగించాలంటే.. అనుచరులు, పార్టీ కార్యకర్తలు, ఇతరులు అభ్యర్థుల వెంట ఉండాలి. వీరికి ఉదయం అల్పాహారం, కాఫీలు, టీలు, మధ్యాహ్నం చికెన్ బిర్యాని, రాత్రి యథాతథం. ఈ ఖర్చులు చాలా ఖరీదు. పార్లమెంట్, శాసనసభ ఎన్నికల్లో పోటీ చేయనున్న ఎంపీ, ఎమ్మెల్యేల అభ్యర్థుల ప్రచార ఖర్చులను కచ్చితంగా లెక్కించేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఎన్నికలకు సంబంధించి ప్రచార సభలు, సమావేశాల నిర్వహణకు అయ్యే ఖర్చులు, కార్యకర్తలకు అందించే కాఫీ, టీ, టిఫిన్, బిర్యానీల కోసం చేసే వ్యయాన్ని అభ్యర్థులు గతంలో తక్కువగా చూపించేవారు. అందుకు ఆస్కారం లేకుండా ఈ సారి ఎన్నికల అధికారులు ధరల జాబితాను రూపొందించారు. జిల్లాలో అభ్యర్థుల ఖర్చులను ఆ జాబితా ప్రకారం లెక్కించనున్నారు. అన్ని లెక్కలు పక్కాగా ఉండాల్సిందేనని ఎన్నికల అధికారులు పేర్కొంటున్నారు.



వ్యయ పరిమితి పెంపు

ఎన్నికల్లో అభ్యర్థులు విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నా.. అత్యధిక మంది ఎన్నికల సంఘం నిర్ణయించిన పరిమితిలోపే లెక్కలు చూపిస్తున్నారు. ఈ పరిమితిని పెంచితే కొంతైనా అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని భావించిన కేంద్ర ఎన్నికల సంఘం అభ్యర్థుల వ్యయాన్ని 2022లో పెంచింది. 2014లో ఎంపీ అభ్యర్థి పరిమితి గరిష్ఠంగా రూ.75 లక్షలు ఉండగా.. 2022లో ఆ మొత్తాన్ని రూ.90 లక్షలకు, ఎమ్మెల్యే అభ్యర్థులకు రూ.28 లక్షల నుంచి రూ.40 లక్షలకు పెంచింది. ఎనిమిదేళ్ల వ్యవధిలో పెరిగిన ఓటర్ల సంఖ్య, ద్రవ్యోల్బణం పరిగణనలోకి తీసుకుని వ్యయ పరిమితిని పెంచింది.

నీళ్ల ప్యాకెట్ నుంచి..పెట్రోల్ బిల్లు వరుకు

ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల్లో పెట్టే ఖర్చులకు సంబంధించి నీళ్ల ప్యాకెట్ నుంచి ప్రతిదీ లెక్క చెప్పాల్సిందేనని కమిషన్ స్పష్టం చేశారు. టీ మొదలుకొని సభలు, సమావేశాల్లో ఏర్పాటు చేసే భారీ బెలూన్లు, ఎల్ఈడీ తెరలకు సైతం ధరలను నిర్ణయించారు. ఒక్కో బెలూన్‌కు రూ.4 వేలు, లౌడ్ స్పీకరుతో ప్రచారంలో వినియోగించే వ్యానుకు ప్రతిరోజు ఆపరేటర్‌తో కలిపి రూ.6,500 ధర నిర్ణయించారు. పట్టణ ప్రాంతాల్లో ఫంక్షన్ హాళ్లలో సమావేశాలు నిర్వహిస్తే రోజుకు రూ.15వేలు అద్దెగా అభ్యర్థి తన ఖర్చులో నమోదు చేయాలి. ఎన్నికల సంఘానికి అభ్యర్థి సమర్పించే ఎన్నికల వ్యయంలో కుర్చీలు, టేబుళ్లు, వాహనాల అద్దె, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనే కళాకారుల పారితోషికం, ఎన్నికల ప్రచారంలో వినియోగించే తూఫాన్, కారు, బొలెరో వంటి వాహనాలకు రోజూ రూ.1000 నుంచి రూ.1,800 వరకు అద్దెతో పాటు డ్రైవరు బత్తా రూ.500 ప్రకారం బిల్లులు చెల్లించాల్సి ఉంటోందని ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు.

సార్వత్రిక సమరం

రాజోలుకు రాజు ఎవరు?

- వైసిపి, జనసేన మధ్య హోరాహోరీ పోరు
- పోటాపోటీగా గొల్లపల్లి, దేవ ప్రచారం
- తీవ్ర ఉత్కంఠలో నియోజకవర్గ ప్రజలు

ప్రజాశక్తి- రాజోలు

అమలాపురం లోక్ సభ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రాజోలు ఒకటి. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ఈ నియోజకవర్గాన్ని షెడ్యూల్ తరగతులకు రిజర్వ్ చేశారు. రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాలతోపాటు మామిడికుదురు మండలంలోని కొంత భాగం ఈ నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో రాజోలు నుంచి ఎవరు ఎంఎల్ఎగా గెలుస్తారనే దానిపై ఆసక్తి నెలకొంది. జనసేన గెలిచిన ఏకైక స్థానం రాజోలు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన తరపున పోటీ చేసిన రాపాక వరప్రసాదరావు రాజోలు ఎంఎల్ఎగా గెలుపొందారు. ఆ ఎన్నికల్లో జనసేన గెలిచిన ఏకైక స్థానం ఇదొక్కటే. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సైతం తాను పోటీ చేసిన రెండు చోట్లా ఓడిపోయారు. దీంతో రాజోలు నుంచి గెలిచిన రాపాక అందరి దృష్టిని ఆకర్షించారు. ఎన్నికల ముందు వైసిపి నుంచి జనసేనలోకి చేరి.. ఎంఎల్ఎగా గెలిచిన రాపాక కొంత కాలానికే అధికార పార్టీ వైసిపికి చేరువయ్యారు.

నియోజకవర్గ రాజకీయ నేపథ్యం ఇదీ...

రాజోలు నియోజకవర్గంలో ఆరుసార్లు కాంగ్రెస్ పార్టీ గెలవగా.. తెలుగు దేశం ఐదుసార్లు గెలిచింది. సిపిఐ రెండుసార్లు, ఇండిపెండెట్, జనసేన చెరోసారి గెలుపొందారు. సిపిఐకి చెందిన అల్లూరి వెంకటరామరాజు 1952లో రాజోలు ఎంఎల్ఎగా గెలిచారు. 1955లోనూ ఆయన మరోసారి ఎంఎల్ఎగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ పార్టీ విషయానికి వస్తే.. 1962లో గెడ్డం మహాలక్ష్మి రాజోలు నుంచి విజయం సాధించారు. 1967లో జీఆర్ నాయినాల ఎంఎల్ఎగా గెలిచారు. 1972లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన బిక్కిన గోపాల కృష్ణారావు విజయం సాధించారు. నాలుగుసార్లు గెలిచిన సూర్యనారాయణరాజు. 1983, 1985ల్లో తెలుగు దేశం పార్టీకి చెందిన అల్లూరి వెంకట సూర్యనారాయణ రాజు రాజోలు ఎమ్మెల్యే అయ్యారు. 1985లో గెలిచిన తర్వాత సూర్యనారాయణ రాజు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా పని చేశారు. 1985 మార్చి [illegible] నుంచి 1989 నవంబర్ 11 వరకు ఆయన ఆ పదవిలో కొనసాగారు. 1994, 1999లో నా నారాయణ రాజు రాజోలు ఎంఎల్ఎగా



ఎంఎల్ఎగా విజయం సాధించారు. మళ్లీ 2004లో వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రభంజనం సమయంలో హస్తం పార్టీ అభ్యర్థి అల్లూరి కృష్ణంరాజు రాజోలు ఎంఎల్ఎగా ఎన్నికయ్యారు. అల్లూరి వెంకట సూర్యనారాయణ రాజుపై 28 వేల ఓట్ల తేడాతో ఆయన గెలుపొందారు. 2009లో గెలిచిన రాపాక.. 2008లో నియోజకవర్గాల పునర్విభజన అనంతరం రాజోలు ఎస్సీ రిజర్వ్‌డ్‌గా మారింది. 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన రాపాక వరప్రసాద్ రావు 5,869 ఓట్ల తేడాతో ప్రజారాజ్యం పార్టీకి చెందిన నల్లి వెంకటకృష్ణ మల్లిక్‌పై గెలుపొందారు. టిడిపికి చెందిన బత్తుల రాము 25,286 ఓట్లతో మూడో స్థానానికి పరిమితం అయ్యారు. 2013 లో ఆంధ్రప్రదేశ్ విభజన ఖరారయ్యాక 2014లో నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు 4,683 ఓట్ల తేడాతో వైసిపికి చెందిన బొంతు రాజేశ్వరరావుపై గెలిచారు. ఆ ఎన్నికల్లో నోటాకు 856 ఓట్లు రాగా.. ఇండిపెండెంట్‌గా రాపాక వరప్రసాదరావు 318 ఓట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. 2019 ఎన్నికల్లో రాజోలులో త్రిముఖ పోరు నెలకొంది. జనసేన తరపున పోటీ చేసిన రాపాక వరప్రసాద రావు 814 ఓట్ల స్వల్ప తేడాతో వైసిపికి చెందిన బొంతు రాజేశ్వరరావుపై విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో రాపాకకు 50,053 ఓట్లు పడగా.. బొంతు రాజేశ్వరరావుకు 49,239 ఓట్ల పోలయ్యాయి. టిడిపి అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు 44,592 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు.

గెలుపై ధీమాలో ఇరుపార్టీలు..!

2014 సార్వత్రిక ఎన్నికలలో రాజోలులో టిడిపి అభ్యర్థిగా గెలిపొందిన గొల్లపల్లి సూర్యరావు, 2019లో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు. మరలా 2024లో టిడిపి నుండి సీటు ఆశించినప్పటికి పొత్తులో భాగంగా తనకు సీటు ఇవ్వకపోవడంతో వైసిపిలో చేరిన గొల్లపల్లి కొద్ది రోజుల వ్యవధిలోనే రాజోలు ఎంఎల్ఎ అభ్యర్థిగా సీటు తెచ్చుకుని తన రాజకీయ ఎత్తుగడకు తెరలేపారు. రాపాక వర్గం గొల్లపల్లికి జై కొట్టడంతో అధిష్టానం ఆదేశాల మేరకు రాజోలు ఎంల్ఎ రాపాక వరప్రసాద్‌కూడా గొల్లపల్లిని గెలిపించాలని చాటడంతో వైసిపి కేడర్ మొత్తం ఒకతాటి పైకి వచ్చింది. దీనికి తోడు రాజోలు నియోజకవర్గంలో పది సంవత్సరాలుగా గొల్లపల్లి సుపరిచితుడు కావడం గొల్లపల్లి గెలుపు నల్లేరు మీద నడక అని రాజకీయ విశ్లేశకులు అంటున్నారు. జనసేనకు కొత్త అభ్యర్థి కావడంతో గొల్లపల్లి అనుభవం ముందు నిలబడగలడా అని పలు విమర్శలు తలెత్తుతున్నాయి. 2019 ఎన్నికలలో జనసేన అభ్యర్థి రాపాక వరప్రసాద్ గెలవడం రాష్ట్రంలో ఒకేఒక్క సీటు రాజోలు కావడంతో మొదట నుండి రాజోలు నియోజకవర్గంపై రాష్ట్ర వ్యప్తంగా చర్చ జరుగుతుంది.ప్రస్తుతం పొత్తు నేపథ్యంలో ఉమ్మడి అభ్యర్థిగా జనసేనకు సీటు కేటాయించిన పార్టీలు. అభ్యర్థిగా రిటైర్డ్ ఐఎఎస్ దేవ వరప్రసాద్ పేరును ప్రకటించడంతో జనసేన పార్టీలో టికెట్ ఆశించి వైసిపి నుండి రెండుసార్లు పోటీ చేసి ఓడిపోయిన బొంతు రాజేశ్వరరావు తన వర్గం బొంతుకే సీటు కేటాయించాలని చేసిన రచ్చ ఇంతా అంతా కాదు.త`నకే దాదాపు సీటు ఖరారు అయింది అనుకున్న సమయంలో దేవ వరప్రసాదగ ను తీసుకోచ్చింది జనసేన అధిష్టానం. ఎదిఎమైనా ప్రత్యర్థి రాజకీయ కురవద్దుడు గొల్లపల్లి ని ఢీ కొట్టాలంటే టిడిపి,జనసేన,బిజెపి ఉమ్మడి అభ్యర్థికి వర్గపోరు లేకుండా ఉంటేనే సాధ్యం అవుతుంది, లేకపోతే నియొజకవర్గంలో జనసేనకు అపజయం తప్పదని పలువురు అంటున్నారు..

చంద్రబాబు నాయుడుతో బి.ఫామ్‌లు అందుకున్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా టిడిపి అభ్యర్థులు

బి.ఫామ్ అందుకున్న టిడిపి అభ్యర్థులు

ప్రజాశక్తి - అమలాపురం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పోటీ చేస్తున్న టిడిపి అభ్యర్థులు ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు నుంచి బి.ఫామ్‌లు అందుకున్నారు. జిల్లా నుంచి ఐదు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానానికి టిడిపి అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అమలాపురానికి అయితాబత్తుల ఆనందరావు, ముమ్మిడివరానికి మాజీ ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు, రాజోలుకు మాజీ మంత్రి గొల్లపలి సూర్యారావు, కొత్తపేటకు మాజీ ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, మండపేట అసెంబ్లీ స్థానానికి సిట్టింగ్ ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరావు, అమలాపురం పార్లమెంట్ స్థానానికి బాలయోగి కుమారుడు జి.హరీష్ మాథూర్ పోటీలో ఉన్నారు. ఆదివారం మంగళగిరి లోని టిడిపి కేంద్ర కార్యాలయంలో చంద్రబాబు చేతులు మీదుగా వీరందరూ బి.ఫామ్ అందుకున్నారు.

బి.ఫామ్‌ను అందుకున్న సత్యప్రభ

ఏలేశ్వరం : టిడిపి ప్రతిపాడు నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సత్యప్రభ ఆదివారం టిడిపి అధినేత చంద్రబాబు చేతుల మీదుగా బి.ఫామ్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు పార్టీ అధినేత తనపైఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రతి ఒక్కరి సహకారంతో, తన భర్త వరుపుల రాజా ఆశీస్సులతో ఎంఎల్ఎగా విజయం సాధిస్తానని ధీమాను వ్యక్తం చేశారు.

యనమల దివ్యకు బి.ఫామ్

కోటనందూరు : టిడిపి తుని నియోజకవర్గ అభ్యర్థి యనమల దివ్య టిడిపి అధినేత చంద్రబాబు చేతుల మీదుగా ఆదివారం బి ఫామ్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా దివ్య మాట్లాడుతూ బీఫామ్ అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. చంద్రబాబు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టి తుని నియోజకవర్గంలో అఖండ మెజార్టీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. మొట్టమొదటిసారిగా రాజకీయాల్లోకి అడుగుపెట్టిన తనకు తుని నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదిస్తారని, టిడిపికి పూర్వవైభవం తీసుకువస్తానని దివ్య అన్నారు. సోమవారం నామినేషన్ వేయనున్నట్టు ఆమె తెలిపారు.

బి.ఫామ్ అందుకుంటున్న యనమల దివ్య

బి.ఫామ్ అందుకుంటున్న వరుపుల సత్యప్రభ

టిడిపిలోకి తిప్పరాజుపాలెం సర్పంచ్

ప్రజాశక్తి - కాజులూరు

మండలంలోని తిప్పరాజపురం సర్పంచ్ యాళ్ల మాణిక్యాంబ టిడిపిలో చేరారు. ఆదివారం తిప్పరాజుపాలెంలోని సర్పంచ్ స్వగృహంలో టిడిపి రామచంద్రపురం నియోజకవర్గ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ సతీమణి సునీత ఆధ్వర్యంలో తన అనుచరులతో ఆమె టిడిపిలో చేరారు. వీరికి సునీత కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి యాళ్ల కృష్ణారావు, కొప్పిశెట్టి స్వామినాయుడు, వాసంశెట్టి సత్యం, గుబ్బల యేసురాజు, గండి కిషోర్, ఆనాల వెంకటేశ్వరరావు, కేదారేశ్వరుడు, ధనంజయ పాల్గొన్నారు.

పెద్దనాపల్లిలో వైసిపికి ఎదురు దెబ్బ

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండలంలోని పెద్దనాపల్లి గ్రామంలో వైసిపికి ఎదురు దెబ్బ తగిలింది. పెద్దనాపల్లి గ్రామంలో ఎప్పటినుండో రెండు వర్గాలుగా ఉన్న ఎంపిపి గొల్లపల్లి బుజ్జి గ్రూపు టిడిపికి, సర్పంచ్ బుద్ధ సూరప్రకాష్ గ్రూపు వైసిపికి మద్దతుగా ఉన్నాయి. అనూహ్యంగా సర్పంచ్ బుద్ధ సూరిప్రకాష్, ఎంపిటిసి సభ్యులు బుద్ధ సత్యవతి, మాజీ ఎంపిటిసి సభ్యులు శిలపరశెట్టి వెంకన్న బాబు, బుద్ధ ఈశ్వరరావు వైసిపికి రాజీనామా చేశారు. ఆదివారం ఎంపిపి గొల్లపల్లి బుజ్జి, ప్రత్తిపాడు టిడిపి అభ్యర్థి పర్వత సత్యప్రభ ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. దీంతో పెద్దనాపల్లి గ్రామం మొత్తం టిడిపికి మద్దతుగా మారిపోయింది.

టిడిపిలో పలువురి చేరిక

మండపేట : జగన్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, చంద్రబాబు నాయుడు సీఎం అవ్వడం ఖాయమని శాసన సభ్యులు వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. కపిలేశ్వరపురం మండలం, కాలేరు గ్రామానికి చెందిన పలువురు ఆ గ్రామ టీడీపీ నాయకులు వల్లూరి కాశీ విశ్వనాథం, గుణ్ణం సత్యనారాయణ, మత్తాల మధుసూధనరావు ఆధ్వర్యంలో ఆదివారం టిడిపిలో చేరారు. మండపేట టిడిపి కార్యాలయంలో ఎంఎల్ఎ వేగుళ జోగేశ్వరావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ కష్టపడి పనిచేసిన వారికి టిడిపిలో ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు.వచ్చే ఎన్నికల్లో ప్రతీ ఒక్కరూ కష్టపడి టిడిపిని గెలిపించాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో మెర్ల తాతాజీ, గుణ్ణం రాంబాబు, కోర వంశీ, యరమాటి అచ్చిబాబు, గుణ్ణం సత్యనారాయణ, పసుపులేటి రామకష్ణ, ఖండవిల్లి శ్రీనివాసు, మట్టా ఏసు, మట్టా గణియ్య, వినకోట జానకిరామయ్య, టేకి రాజు, వినకోట సూర్యనారాయణ, సలాది వీరన్న తదితరులున్నారు.

గోకవరం : మండలంలోని కృష్ణునిపాలెం, వెంకటాపురం, కొత్తూరు గ్రామాలకు చెందిన పలువురు టిడిపిలో చేరారు. వీరందరికీ ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ కండువాలు వేసి ఆహ్వానించారు. బోలగుండ వెంకన్నదొర, రేఖ హరిబాబు, రౌతు వెంకటేశులు, మిరప ప్రసాద్, కొంగరపు చిన బాపిరాజు, తుర్రం కృష్ణ, దొరబాబు, లచ్చన్న దొర, బానమ్మ, కనక దుర్గ, లక్ష్మి, అనురాధ తోసుమారు 20 కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ప్రజలను నమ్మించి మోసం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు.క్లస్టర్ ఇంచార్జ్ కన్నబాబు ఆధ్వర్యంలో కృష్ణుని పాలెంలో టిడిపి మరింత బలపడిందన్నారు.

టిడిపి తీర్థం పుచ్చుకున్న మాజీ సర్పంచ్‌లు

రామచంద్రపురం : కె.గంగవరం మండలానికి చెందిన పలువురు మాజీ సర్పంచ్‌లు ఆదివారం టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. మాజీ సర్పంచ్ తరపట్ల ఆనంద రావు, వినకోటి. శ్రీనివాస్, రాజేష్ రమణ , భీమరాజు, గెద్దాడ రమణ టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి మాజీ సభ్యులు మేడిశెట్టి రవికుమార్, బాబూరావు, బాలాంతరం మాజీ సర్పంచ్ ఈరెళ్ల రాజు, ఎర్ర పోతవరం మాజీ సర్పంచ్ దున్న అన్నవరం, నియోజకవర్గం ఎస్‌సి సెల్ నాయకులు రవ్వా భూషణం , తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ నిర్వహణకు సన్నద్ధం కావాలి

రిటర్నింగ్ అధికారి, రాజమహేంద్రవరం కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం పార్లమెంటు, సిటీ అసెంబ్లీ నియోజక వర్గాలకు మే 13న జరిగే పోలింగ్ నిర్వహణకు పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని రిటర్నింగ్ అధికారి, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్‌కుమార్ ఆదేశించారు. ఆదివారం ఎన్నికల విధులకు సంబంధించిన అసిస్టెట్ రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది, బూత్ లెవెల్ అధికారులు తదితరులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధుల నిర్వహణలో ఉన్న సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ వేసేందుకు ఈ నెల 26లోగా ఫారం-12 దాఖలు చేయాలన్నారు. జిల్లాలో ఇతర నియోజకవర్గంలో ఓటు ఉన్న అధికారులు ఫారం-12 దాఖలు చేయాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఓటు కలిగినవారు రిటర్నింగు అధికారి ద్వారా తమ ఫారం-12ను దాఖలు చేయొచ్చన్నారు. ఫారం-12తో పాటు ఫొటో, డ్యూటీ సర్టిఫికెట్ / ఎన్నికల విధి నిర్వహణ ఉత్తర్వులు దాఖలు చేయాలని, నగరపాలక సంస్థలో పనిచేసే సెక్రటరీలు తమ ఫారం-12 సంబంధిత ఉత్తర్వులు జతచేసి అదనపు కమిషనర్‌కు అందించాలన్నారు. మే 2న హోమ్ ఓటింగ్, 3 నుంచి 5 వరకూ ఇవిఎంల కమిషనింగ్, 6న ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు రెండవ విడత శిక్షణ ఇస్తామని తెలిపారు.

ఉదయం శిక్షణ పూర్తి అయిన తదుపరి మధ్యాహ్నం ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగు జరుగుతుందన్నారు. 7న ఇతర పోలింగు అధికారులకు, ఎన్నికల విధులలో ఉండే డ్రైవర్లు, క్లీనర్లు, వీడియోగ్రాఫర్లు తదితరులకు, 8న పోలీస్ డిపార్టుమెంటు, మైక్రో అబ్జర్వర్లకు, ఫెసిలిటేషన్ సెంటర్లలో ఓటింగు ఏర్పాటు చేస్తామన్నారు. పోస్టల్ ఓటింగు ఫెసిలిటేషన్ సెంటరుగా ఆర్ట్స్ కళాశాలలోని బుద్ధ భవనాన్ని ఎంపిక చేశామని తెలిపారు. అందులోని ఎన్నికల విధులు నిర్వహించే అన్ని వర్గాలకు పోస్టల్ ఓటింగు చేపడతామన్నారు. అలాగే రిటర్నింగు అధికారి కార్యాలయం (నగరపాలక సంస్థ కార్యాలయములోని మొదటి అంతస్తు)లో అత్యవసర సర్వీసుల వారికి పోస్టల్ బ్యాలెట్ దాఖలు చేయొచ్చన్నారు. మే 4 నుంచి 8వరకూ బూత్ లెవెల్ అధికారుల ద్వారా ఓటర్ల స్లిప్‌లు అందిస్తామన్నారు. 9 నుంచి సెక్టర్ అధికారులు, ఇంజనీరింగు అధికారులు, పోలింగు స్టేషన్లలో కావాల్సిన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమం 10నాటికి పూర్తి చేసుకోవాలన్నారు. ఈ నెల 26తో పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి ఫారం-12 ఇస్తారన్నారు. 27 నుంచి 30 వరకూ అన్ని వివరాలను ఓటర్ల జాబితాలో మార్కు చేసే కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. మే 10 నాటికి ఎన్నికల సామగ్రి అంతా పోలింగు స్టేషన్ల వారీగా విడదీసి సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. హోమ్ ఓటింగ్‌కు సంబంధించి అన్ని పోలింగు స్టేషన్ల పరిధిలో ఓటర్లను బూత్ లెవెల్ అధికారులను సిద్ధం చేయాలన్నారు. ఓటరు కార్డులోని చిరునామాలోనే ఓటరు నివాసం ఉండాలన్నారు. వేరే చోటుకు మారితే వారికి హోమ్ ఓటింగుకు అవకాశము లేదన్నారు. ఇలాంటి వారిని సోమవారం లోగా గుర్తించి వారి నుంచి అనంగీకారము దాఖలు చేసుకొనవచ్చన్నారు. లేకుంటే ఓటు వేసే అవకాశం ఉండదన్నారు. అనివార్య కారణాల వల్ల ఓటు వేయనివారుంటే వారికి తిరిగి మే 8న అవకాశమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనరు పిఎం.సత్యవేణి, సూపరింటెండెంట్ ఇంజనీర్ జి.పాండురంగారావు, తహశీల్దార్ కె.ఆంజనేయులు, డిప్యూటీ కమిషనర్ ఎస్‌వి.రమణ, నోడల్ అధికారులు, బూత్ లెవెల్ అధికారులు, సూపర్‌వైజర్లు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం వైసిపి అభ్యర్థిగా నేడు విప్పర్తి నామినేషన్

ప్రజాశక్తి - పి.గన్నవరం

పి.గన్నవరం నియోజకవర్గ అసెంబ్లీకి వైసిపి అభ్యర్థిగా విప్పర్తి వేణుగోపాలరావు సోమవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఇందులో భాగంగా పి.గన్నవరం మూడు రోడ్ల జంక్షన్‌లోని పార్టీ కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందించనున్నారని నాయకులు తెలిపారు. నియోజకవర్గ ప్రజలు, ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అందరూవిజయవంతం చేయాలని, తనను ఎంఎల్ఎగా గెలిపించాలని విప్పర్తి కోరారు. తనకు ఎంఎల్ఎ అభ్యర్థిగా అవకాశం కల్పించిన సిఎం జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు వైసిపి ఎంపీ అభ్యర్థి గూడూరి నామినేషన్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

వైసిపి రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థిగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్ సోమవారం నామినేషన్ వేయనున్నారు. స్థానిక తిలక్ రోడ్‌లో వైసిపి పార్లమెంట్ కార్యాలయంలో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో గూడూరి మాట్లాడారు. సోమవారం ఉదయం 10.45 గంటలకు బి.ఫామ్‌తో పాటూ మూడు సెట్ల నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందించనున్నట్టు తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సిఎం జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేశ్శారన్నారు. ఈ పథకాలే వైసిపికి మరోమారు పట్టం కడతాయన్నారు. సంక్షేమ పథకాల వల్ల రాష్ట్రంలో 12 శాతం ఉన్న పేదరికం 4.8 శాతానికి తగ్గిందన్నారు. విద్య, వైద్యా రంగాలకు జగన్ అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ తరహాలో రూపుదిద్దుకున్నాయన్నారు. ఆరోగ్యశ్రీ పథకంలో పరిమితిని రూ.25 లక్షలకు పెంచడం ద్వారా ప్రజలకు కార్పొరేట్ వైద్యం సులభతరంగా అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నందెపు శ్రీనివాస్, కానుబోయిన సాగర్, గూడూరి రాధిక, పొలసానపల్లి హనుమంతరావు, మానే దొరబాబు, కడలి వెంకటేశ్వరరావు, గుత్తుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.